# రైలు కింద పడి దంపతుల ఆత్మహత్య

**ఘట్‌కేసర్, జులై 3, ప్రభాతవార్త:** రైలు కింద పడి దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లో చోటుచేసుకుంది. పెద్దఅంబర్‌పేట్ కుంట్లూరు అశోక్‌నగర్‌కు చెందిన దంపతులు రవి కుమార్ (42), శిరీష (33)లు ఘట్‌కేసర్– బీబీ నగర్ రైల్వేస్టేషన్ల మధ్య గురు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకు న్నారు. మృతులు మహబూబాబాద్ జిల్లా చెన్నా రావుపేట్ మండలం పాపాయిపేట వాసులుగా గుర్తించారు. గురువారం రాత్రి 10 గంటలకు రైలు పట్టాలపై ఇద్దరి మృతదేహాలను చూసిన శాతవాహన ఎక్స్‌ప్రెస్ లోకోపైలట్ ఘట్‌కేసర్ డిప్యూటీ ఎస్ఎస్‌కు సమాచారం ఇవ్వగా సికింద్రాబాద్ ఆర్పీఎస్ నుంచి హెడ్‌కానిస్టేబుల్ నారాయణ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పట్టాలకు సమీపంలో చూడగా హీరోహోండాప్రొ బైక్ నిలిపి ఉండగా మృతుని జేబులో బైక్ తాళాలు లభించాయి. మొబైల్ ఫోన్‌లో ఉన్న వివరాల ఆధారంగా మృతులను గుర్తించి కుటుంబ



**ఆత్మహత్య చేసుకున్న రవికుమార్, శిరీష**

>>2



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# సస్పెండ్ చేసి పడేస్తా

★ఎవరినీ వదలను ★నా పీఏ అయినా సరే..
★డిసిసి లేఖ ఎలా లీకైంది? ★వజ్రేశ్ యాదవ్ సీరియస్ ★గుండ్లపోచంపల్లి కాంగ్రెస్ అధ్యక్ష పదవిపై కొనసాగుతున్న రచ్చ

**మేడ్చల్, జులై 3, ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి చుట్టూ రాజకీయం రోజురోజుకూ మరింత వేడెక్కుతోంది. డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ గౌడవెల్లి మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్‌ను డివిజన్ అధ్యక్షుడిగా నియమించడంతో ఒక వర్గం తీవ్ర అసంతృప్తికి గురై మూకుమ్మడిగా రాజీనామాలు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు నకిలీ లేఖల వ్యవహారం కాంగ్రెస్‌లో కొత్త ప్రకంపనలు సృష్టిస్తోంది.

**పార్టీ అంతర్గత విషయాలు బయటకు తెచ్చిన వారిని క్షమించేదిలేదు**

శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ ఈశ్వర్ విలేకరులకు ఓ లేఖను చూపించారు. డీసీసీ నుంచి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు పంపిన సిఫార్సు లేఖలో మొదట బండారి నరేందర్ పేరు ఉండగా, దానిని కొట్టివేసి సురేందర్ ముదిరాజ్ పేరును చేర్చినట్లుగా కనిపించే కాపీ బయటకు వచ్చిందని ఆయన ఆరోపించారు. ఈ లేఖ అసలు బయటకు ఎలా వచ్చిందనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు. గ్రామానికి చెందిన మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ ఈ లేఖ గురించి అందరికీ చెబుతున్నాడని, అందువల్ల ఈ వ్యవహారంలో ఆయన పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.

**సమగ్ర విచారణ జరిపించాలని : మాజీ సర్పంచ్**

ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలోనే డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్‌కు ఫోన్ చేసి స్పీకర్‌లో ఈశ్వర్ మాట్లాడించారు. దీనిపై స్పందించిన ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, శ్రీనివాస్ అయినా సరే, ఎవరైనా సరే ఊరుకునేది లేదు. నా పీఏ అయినా వదలను. అవసరమైతే ఇప్పుడే పదవి నుంచి తీసేస్తా. పార్టీ అంతర్గత పత్రాలు బయటకు తీసుకొచ్చిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించం. అందరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం. సస్పెండ్ చేసి పడేస్తా అంటూ మాస్ వార్నింగ్ ఇచ్చారు. >>2



రాజాపూర్‌లో అభిషేకం చేస్తున్న గ్రామస్తులు

# దేవుడా ఇక.. నువ్వే దిక్కు!

## వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయని అన్నదాతల ఆందోళన

## వరుణుడి కరుణ కోసం జలాభిషేకం

**ధారూర్, జులై 3 ప్రభాతవార్త:** తొలకరి పలకరించింది. ఇక పంటలు వేసుకోవచ్చనే ఆనందంతో ఉన్న అన్నదాతను వాతావరణం వణికిస్తోంది. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు వారి ఆశలపై నీళ్ల చల్లుతున్నాయి. ఎలినినో ప్రభావం వల్ల ఈ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతుందన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. కాగ్నా నదితో పాటు జిల్లాలోని మూడు మధ్యతరహా ప్రాజెక్టులు నీటి మట్టం అడుగంటుతున్న నేపథ్యంలో ఈ ఏడాది తొలకరి తమను నిండా ముంచేస్తోందనే ఆవేదన రైతుల్లో పెల్లుబికుతోంది. తమకు వచ్చిన కష్టాన్ని భగవంతుడే దూరం చేయాలని, వరుణ దేవుడి కరుణ కోసం అన్నదాతలు దైవాన్ని ఆశ్రయిస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, ప్రకృతి ప్రసన్నం కావాలని కోరుతూ మండల పరిధిలోని రాజాపూర్ గ్రామంలో రైతులు, గ్రామస్థులు కలిసి శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు పడక, చేతికొచ్చిన పంటలు కళ్ల ముందే ఎండిపోతుండటంతో ఆందోళన చెందిన రైతాంగం ప్రకృతిని ప్రసన్నం చేసుకునేందుకు ఈ పూజలు చేపట్టింది. గ్రామ శివారులోని దైవ సన్నిధిలో వరుణ దేవుడిని వేడుకుంటూ భక్తిశ్రద్ధలతో జలాభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులంతా ఒకేతాటిపైకి వచ్చి ఐక్యంగా ప్రార్థనలు జరిపారు. ఎలాగైనా వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని, తద్వారా రైతుల కష్టాలు తీరాలని భగవంతుడిని వేడుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులు, మహిళలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# టెక్నాలజీకే టోకరా





## డ్యూటీకి పంగనామం పెడుతున్న టీచర్లు

## ఫేస్ రికగ్నిషన్ హాజరుతో సర్కారు స్కూళ్లలో మాయాజాలం

## ప్రశ్నించిన హెచ్‌ఎంలపై రివర్స్ బ్లాక్‌మెయిలింగ్

## పొలిటికల్ లీడర్ల వెనుక తిరుగుతూ పైరవీలు

## ఉపాధ్యాయుల తీరుపై విద్యాశాఖ సీరియస్

## రంగంలోకి కొత్త డిఇఓ

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** జ్ఞానాన్ని బోధించాల్సిన గురువులు.. టెక్నాలజీకే టోకరా వేస్తున్నారు! ప్రభుత్వ నిబంధనలకు 'పంగనామం' పెడుతూ సొంత పనుల్లో బిజీ అయిపోతున్నారు. వికారాబాద్ జిల్లాలో కొంతమంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఫేషియల్ రికగ్నిషన్ (ముఖ గుర్తింపు) అటెండెన్స్ యాప్‌ను అడ్డం పెట్టుకుని సాగిస్తున్న వ్యవహారం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది.

**జిల్లాలో రోజువారీ తంతు ఇలా ..**

ఉదయం సరిగ్గా టైంకి స్కూల్‌కి రావడం, ఫోన్ తీసి ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌లో అటెండెన్స్ బటన్ నొక్కడం.. అంతే, అక్కడితో వారి డ్యూటీ ఖతం. ఆ వెంటనే హెడ్ మాస్టర్‌కు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా స్కూల్ గేటు దాటేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రోజంతా బయట తిరుగుతూ.. మళ్లీ సాయంత్రం వేళకు స్కూ ల్‌కు వచ్చి చెక్‌అవుట్ కొట్టి చెక్కేస్తున్నారని తెలుస్తోంది. ఏడాది కాలంగా ఈ డిజిటల్ హాజరు విధానం అమలులో ఉన్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పర్యవేక్షణ శూన్యమైంది. కొంతమంది స్థానిక విద్యాశాఖ అధికారులకు, ఈ పైర'వీరులకు' మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాలే ఈ నిర్లక్ష్యానికి కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**నోరు విప్పలేకపోతున్న హెచ్‌ఎంలు,ఎంఇవోలు**

ఈ అక్రమాలను అడ్డుకోవాల్సిన హెడ్ మాస్టర్లు సదరు టీచర్లను ప్రశ్నించేందుకు వణికిపోతున్నారు. 'మీరు మాత్రం రూల్స్ కరెక్ట్‌గా పాటిస్తున్నారా? మీ గుట్టు కూడా నా దగ్గర ఉంది' అంటూ ఎదురు తిరుగుతూ హెచ్‌ఎంలను బ్లాక్‌మెయిల్ చేస్తుండటంతో వారు నోరు విప్పలేకపోతున్నారు. అంతటితో ఆగకుండా, మండల విద్యాశాఖ అధికారులను సైతం కొంతమంది టీచర్లు బెదిరింపులకు గురిచేస్తున్నారంటే పరిస్థితి ఎంత దిగజారిందో అర్థం చేసుకోవచ్చు.

**సబ్జెక్టు టీచర్ల భోదన తీరుపై అసంతృప్తి**

జిల్లాలో మొత్తం 1066 ప్రభుత్వ స్కూళ్లు ఉన్నాయి, వాటిలో ప్రాథమిక 774, ప్రాథమికోన్నత 116, ఉన్నత పాఠశాలలు 176 ఉండగా 65 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఐదు వేలమందికి పైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పలు హైస్కూళ్లలో ఆయా సబ్జెక్టు టీచర్లు విద్యార్థులకు సరిగ్గా భోధించడం లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**65 వేల మంది పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం**

కొంతమంది టీచర్లు గ్రామాల్లో ఉండే బడా రాజకీయ నాయకులతో సన్నిహితంగా ఉంటూ, స్కూల్ >>2

# వైరల్ హెపటైటిస్‌పై ఫోకస్

## నిర్మూలనకు శాఖల సమన్వయంతో చర్యలు వేగవంతం

## అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి

**రంగారెడ్డి అర్బన్, జులై3, ప్రభాతవార్త :** ప్రపంచ హెపటైటిస్ నిర్మూలన లక్ష్యంగా వైరల్ హెపటైటిస్ నివారణ, ముందస్తు గుర్తింపు, చికిత్స కార్యక్రమాల అమలుపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం గౌరవ అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి, ఐఏఎస్ అధ్యక్షతన కొంగర కలాన్‌లోని ఐడీఓసీ కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ఆరోగ్య శాఖలు, అనుబంధ విభాగాల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డా. డి. స్వర్ణ కుమారి, అదనపు డీఎంహెచ్‌వో డా. వై. పాపారావు, జాతీయ వైరల్ హెపటైటిస్ నియంత్రణ కార్యక్రమం ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. చి. రాకేష్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, జిల్లా క్షయవ్యాధి నియంత్రణ అధికారి, ఎంసీహెచ్ ప్రోగ్రామ్ ఆఫీసర్, వివిధ కార్యక్రమాల అధికారులు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, జిల్లా ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, కొండాపూర్ జిల్లా ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డా. సుధాకర్ బండారి, తలసేమియా, సికిల్ సెల్ సొసైటీల ప్రతినిధులు, ఎస్ఈ ఆర్‌డబ్ల్యూఎస్, జిల్లా విద్యా శాఖాధికారి, ట్రాన్స్‌జెండర్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎఫ్‌ఎస్‌డబ్ల్యూ కమ్యూనిటీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో అమలవుతున్న క్షయవ్యాధి నిర్మూలన, మాతాశిశు ఆరోగ్య, ఎయిడ్స్ నియంత్రణ, జాతీయ వైరల్ హెపటైటిస్ నియంత్రణ కార్యక్రమాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. వైరల్ హెపటైటిస్ నివారణ, ముందస్తు గుర్తింపు, సమయానుకూల చికిత్స ద్వారా ప్రజారోగ్యాన్ని మెరుగుపర్చాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అందుబాటులో >>2



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్మయి



జెసిబితో పూడిక తీస్తున్న సిబ్బంది

# నాలాల ప్రక్షాళనపై నజర్

## ముమ్మరంగా పూడికతీత పనులు

## వర్షా కాలంలో మురుగుకు ఆటంకం లేకుండా చర్యలు

## నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశం

**శామీర్‌పేట, జులై 3, ప్రభాతవార్త:** అలియాబాద్‌లోని ప్రధాన మురికి కాలువ (నాలా)లో పూడిక తీత పనులను క్షేత్ర స్థాయిలో అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకట్‌రెడ్డి సందర్శించి పరిశీలించారు. అలియాబాద్‌లో ఇటు అధికారులకు, అటు ప్రజాప్రతినిధులకు ప్రధాన మురికి కాలువ సమస్య ఓ సవాల్‌గా మారింది. శుక్రవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ కేంద్రంలో ఉన్న ప్రధాన మురికి కాలువ చెత్త చెదారం, మురికి కూపంగ మారటంతో జెసిబిని ఏర్పాటు చేసి పూడికతీత పనులను చేపట్టారు. మురికికాలువలో పూడిక తీత పనులను ఆయన సందర్శించి పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా డ్రైనేజీ వ్యవస్థను బాగుచేసేందుకు గ్రామంలో ఉన్న ప్రధాన మురికి కాలువ సమస్యగా ఉన్నందున మున్సిపల్ నుంచి పూడికతీత పనులను చేపట్టారు. అలియాబాద్ ఆవాస ప్రాంతం చుట్టూ సుమారు రెండు కిలోమీటర్ల దూరం పాటు ఓపెన్ డ్రైనేజీ నాలాలు, ప్రధాన మురికి కాలువలు, వాటిలో చేపడుతున్న పూడిక తీత పనుల పురోగతిపై సంబంధిత అధికారుల, సిబ్బందితో కమిషనర్ సమీక్షించారు. నాలాలో పేరుకుపోయిన పూడిక చెత్తాచెదారం, ఇతర వ్యర్థపదార్థాలను వెంటనే తొలగించి, వర్షపు నీరు, మురుగునీరుతో ఎటువంటి ఆటంకం లేకుండా పారేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో నీటి నిల్వలు, దోమల వ్యాప్తి, ప్రజా ఆరోగ్య సమస్యలు తలెత్తకుండ ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా మున్సిపాల్టీ పరిధిలోని అన్ని ఓపెన్ డ్రైనేజీ వ్యవస్థలను పర్యవేక్షించి, అవసరమైన మరమ్మతు పనులు, శుభ్ర పరిచే పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పూడికతీత పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందిని కమిషనర్ వెంకట్‌రెడ్డి ఆదేశించారు.



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజలు మున్సిపాల్టీ అధికార యంత్రాంగానికి సహకరించాలని, చెత్తను డ్రైనేజీ నాలాల్లో వేయకుండ పారిశుద్ధ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి కోరారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

# వైభవంగా నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ట

**మేడ్చల్, జులై 3, ప్రభాతవార్త :** సైబరాబాద్ మున్సిపాలిటీ కార్పొరేషన్ పరిధిలోని మేడ్చల్ సర్కిల్ కిష్టాపూర్ పూడూర్ డివిజన్ కిష్టాపూర్ అర్చన కాలనీలో నూతనంగా నిర్మించిన నల్ల పోచమ్మ ఆలయంలో దేవత విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం కనుల పండుగగా కొనసాగుతున్నది. అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం మహాగణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం నిర్వహించారు. ఆ తర్వాత పంచగవ్య సంస్కారం, రక్షాబంధనం ఆచార్యాది రుత్విక్ వరణం, అంకురార్పణ యాగశాల ప్రవేశం, అఖండదీప స్థాపన, చతుషష్ఠి యోగిని సహిత వాస్తు, క్షేత్రపాలక, నవగ్రహ సర్వతోభద్ర మండప దేవత కలశస్థాపన పూజ, యంత్రాభిషేకం, అగ్నిప్రతిష్ఠ గణపతిహోమం, మూలమంత్రహోమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కుంకుమార్చన కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. సాయంత్రం స్థాపిత దేవత హవనం సూక్త, హోమాలు, రుద్రహోమము, ప్రతిష్ట విగ్రహాలకు జలాదివాసం హారతి మంత్రపుష్పం, తీర్థ, ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల మహిళలు, కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయండి

## ప్రజల ఆరోగ్య పరిరక్షణే ముఖ్యం

## పారిశుధ్య సిబ్బందికి మున్సిపల్ చైర్మన్ ఆదేశం

**శామీర్‌పేట, జులై 3, ప్రభాతవార్త :** వర్షాకాలం దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పారిశుధ్య పనులను సమర్థవంతంగ నిర్వహించాలని, ఎప్పటికపుడు చెత్తాచెదారం తొలగించాలని బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సంబంధిత అధికారులను, సిబ్బందికి మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి సూచించారు. అధికారులు, సిబ్బంది విధి నిర్వాహణలో అప్రమత్తంగా ఉండాలని సమస్య వస్తే అప్రమత్తంగా ఉండాలని వెంటనే స్పందించాలని ఆయన సూచించారు. శుక్రవారం మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య సేవలపై సంబంధిత అధికారుల, సిబ్బందితో కమిషనర్ వెంకటగోపాల్‌తో కలిసి చైర్మన్ జాము రవి సమీక్షించారు. ఈ సందర్భంగా మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి మాట్లాడుతూ మూడుచింతలపల్లి మున్సిపాల్టీకి సంబంధించి పారిశుధ్య సంబంధిత అధికారులు, సిబ్బంది, కార్మికులు, పబ్లిక్ హెల్త్ వర్కర్స్‌లు పరిశుభ్రతకు, మురికి కాలువల శుభ్రతకు కృషి చేయాలన్నారు. చెత్త సేకరణ, కాలువల శుభ్రత, పరిశుభ్రమైన వాతావరణం కల్పించటంలో ప్రతి పబ్లిక్ హెల్త్ వర్కర్స్ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి సేవలు అందించాలని చైర్మన్ జాము రవి సూచించారు. ప్రజల ఆరోగ్యం–పరిశుభ్రమైన మున్సిపాల్టీ >>2



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జాము రవి

# కెటిఆర్ సభలో జేబుదొంగల ముఠా అరెస్ట్

-రూ.17.45 లక్షల విలువైన బంగారం, రూ.2.55 లక్షల నగదు రికవరీ

**మహేశ్వరం, జులై 3, ప్రభాతవార్త:** మహేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల నమోదైన జేబుదొంగతనాల కేసులను పోలీసులు ఛేదించి, మూడు ముఠాలకు చెందిన ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి మొత్తం రూ.17.45 లక్షల విలువైన 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.2.55 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఫ్యూచర్ సిటీ డీసీపీ నారాయణరెడ్డి తెలిపారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉండగా, వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతోందని వెల్లడించారు. శుక్రవారం మహేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఫ్యూచర్ సిటీ ఏసీపీ జానకిరెడ్డి, సీఐ (ఎస్‌హెచ్‌వో) రాఘవేందర్‌రెడ్డితో కలిసి డీసీపీ కేసు వివరాలను వెల్లడించారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. జూన్ 27న మహేశ్వరం గ్రామంలోని పీఎస్‌వై కన్వెన్షన్ హాల్ వద్ద జరిగిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రజాసభలో భారీ జనసమ్మర్థాన్ని ఆసరాగా చేసుకుని నిందితులు జేబుదొంగతనాలకు పాల్పడ్డారు. సభకు వచ్చిన వారి జేబుల్లోని నగదును అపహరించడంతో పాటు, కొందరి మెడల్లో ఉన్న బంగారు గొలుసులను పళ్లతో కొరికి తెంచి చోరీ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. ఈ కేసులో కాంబ్లే కైలాష్, అథ్కాడే రవి, కాంబ్లే శ్యామ్‌సుందర్, కాంబ్లే అరుణ్ అలియాస్ చాకు, ఎం.డి. అషాద్‌లను హైదరాబాద్‌లోని హబీబ్‌నగర్, >>2



మాట్లాడుతున్న ఫ్యూచర్ సిటీ డిసిపి నారాయణరెడ్డి

# అన్నం పెట్టే సంస్థకే కన్నం

## రూ. 12.33 లక్షల లాకర్ చోరీ కేసును చేధించిన పోలీసులు

## బెంగళూరులో జల్సా చేస్తున్న ఆఫీస్ బాయ్ అరెస్టు

**జూబ్లీహిల్స్, జులై 3, ప్రభాతవార్త :** బంజారాహిల్స్‌లోని జైన్ కన్‌స్ట్రక్షన్ సంస్థలో నాలుగేళ్లుగా నమ్మకంగా ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్న నిమ్మగడ్డ ఫణీంద్ర (29), తనకున్న అప్పులు, జల్సాల కోసం గత నెల 27న మేనేజర్ గదిలోని రూ. 12.33 లక్షల నగదు ఉన్న గోద్రెజ్ లాకర్ను ఎత్తుకెళ్లాడు.

సంస్థ మేనేజర్ ఫిర్యా దుతో న బంజారాహిల్స్ పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. నిందితుడు పోలీసులకు దొరక్కుండా ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి, బస్సులో ఒంగోలుకు వెళ్లి రూ. 10 వేలు ఇచ్చి ఇద్దరి సహాయంతో లాకర్ పగుల గొట్టాడు.

**సినీ ఫక్కీలో ఛేజింగ్**

అక్కడ ఐఫోన్ కొనుగోలు చేసి, ఆపై నెల్లూరు మీదుగా బెంగ ళూరుకు పారిపోయాడు. సాంకేతిక ఆధారాలతో నిందితుడి జాడ కని పెట్టిన పోలీసులు బెంగళూరుకు వెళ్లి, అతను ప్రయాణిస్తున్న బస్సును సినీ ఫక్కీలో దాదాపు 130 కిలోమీటర్ల మేర ఛేజ్ చేసి టోల్‌గేట్ వద్ద పట్టుకున్నారు. అతని నుంచి లాకర్, రూ. 8.13 లక్షల నగదును స్వాధీ నం చేసుకుని అరెస్ట్ చేశారు.

# బాలుడిపై వీధి కుక్కల దాడి

**మేడ్చల్, జులై 3. ప్రభాతవార్త :** ఆడుకుంటున్న ఓ బాలుడిపై వీది కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి.

ఎల్లం పేట మున్సిపాలిటీలోని డబిల్‌పూర్ గ్రామం లో మహేష్ యాదవ్ కుమారుడు మూడు సంవత్సరాల మోక్షిత్ ఇంటి సమీపంలోని దుకాణం వద్ద ఆడుకుంటున్నాడు. అదే సమయంలో కుక్కల గుంపు ఆ చిన్నా రుడిపై దాడి చేశా యి. ఇది గమనించిన స్థానికులు కుక్కలను వెళ్లగొట్టగా అప్పటికే అతనిని గాయపర్చాయి. బాలుడి చేతి, కడుపు, వీపుపై గాయాలయ్యాయి. అతని కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని ఆస్పత్రికి తరలించారు.

## తెలుగు విశ్వవిద్యాలయంలో రిలే నిరాహార దీక్షలు



తెలుగు విశ్వవిద్యాలయ నాంపల్లి ప్రాంగణంలో రిలే నిరాహారదీక్షలు చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది

**నాంపల్లి, జులై 3 (ప్రభాతవార్త):** తెలుగు విశ్వవిద్యాలయం పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నాంపల్లిలోని విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని తెలంగాణతల్లి విగ్రహం వద్ద శుక్రవారం ఉదయం పెద్దయెత్తున విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు, తెలుగు భాషాభిమానులు, తెలుగు సంస్కృతి పరిరక్షకులు, విద్యార్థి సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని తెలుగు విశ్వవిద్యాలయాన్ని కాపాడుకుందాం, నాంపల్లిలోనే కొనసాగిద్దాం, పరిరక్షిద్దాం, అభివృద్ధి చేద్దాం అనే నినాదాలతో రిలే నిరాహారదీక్షలను ప్రారంభించారు. అదేవిధంగా విశ్వవిద్యాలయ బాచుపల్లి, వరంగల్ ప్రాంగణాల్లో ఉద్యమానికి సంఘీభావం ప్రకటిస్తూ నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయాన్ని కాపాడుకుంటూ అక్కడే కొనసాగాలని వారు డిమాండ్ చేశారు. అలాగే తిరుమల రావు వ్యవహారంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తపరుస్తూ విశ్వవిద్యాలయ పరిరక్షణ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ 2500మందికిపైగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విశ్వవిద్యాలయాన్ని ప్రైవేట్ వ్యక్తుల ప్రభావం నుండి విముక్తిచేయాలని డిమాండ్ చేశారు. తిరుమలరావు వ్యక్తిగత సామాగ్రిని వెంటనే క్యాంపస్ నుండి తొలగించాలని,ఆద్యకళ ఆక్రమణలోనున్న తరగతి గదులను అప్పగించాలన్నారు.ప్రభుత్వం వెంటనే తెలుగు విశ్వవిద్యాలయ పరిరక్షణకు చర్యలు తీసుకుని ప్రైవేట్ వ్యక్తులను పంపివేయాలని విజ్ఞప్తి చేశారు.

## కల్వకుంట్ల కవితను చంపేందుకు ప్రభుత్వం కుట్ర



సమావేశంలో మాట్లాడుతునన ఇస్మాయిల్.

**జూబ్లీహిల్స్, జులై 3 (ప్రభాతవార్త):** తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవితను చంపేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని టీఆర్ఎస్ నాయకులు రూప్‌సింగ్, ఇస్మాయిల్, చిలుక ప్రవీణ్ ఆరోపించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ.. ఉద్యమకారుల తరుపున పోరాటం చేసిన కవితను లక్ష్యంగా చేసుకొని చంపే కుట్ర చేస్తున్నారన్నారు. పోలీసులు అత్యంత క్రూరంగా ప్రవర్తించారని, ఓవరాక్షన్ చేసిన పోలీసులపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా ప్రశ్నించే గొంతులను నులిమేద్దామని చూస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి కన్నుసన్నలలోనే ఇదంతా జరుగుతుందన్నారు. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని, ముమ్ముందు మరింత ఉధృతంగా పోరాటం చేస్తామన్నారు. ఉద్యమకారులపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

## ఉద్యమకారుల సంక్షేమంపై విస్తృత సంప్రదింపులు..

**నాటి ఉస్మానియా విద్యార్థి నాయకులకు కమిటీ ఆహ్వానం**

**తార్నాక, జులై 3 ప్రభాతవార్త :** ఉద్యమకారుల సంక్షేమంపై విస్తృత సంప్రదింపులు, నాటి ఉస్మానియా విద్యార్థి నాయకులకు కమిటీ ఆహ్వానం తెలియజేస్తుందని మోతె సభ్యులు శోభన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారి సంక్షేమం కోసం చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సిఫార్సులు చేసేందుకు జీఓ నెం. 679 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఈ నెల 6వ తేదీ నుంచి ఉద్యమకారులతో విస్తృత స్థాయి సంప్రదింపుల కార్యక్రమాన్ని ప్రారంభించనుందన్నారు. ఇందులో భాగంగా జులై 6న నిర్వహించే తొలి సమావేశంలో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థి జేఏసీ నాయకులతో కమిటీ సమావేశం కానుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో విశిష్ట పాత్ర పోషించిన నాటి విద్యార్థి నాయకులను ఈ సమావేశానికి ప్రత్యేకంగా ఆహ్వానిస్తూ, ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేయాల్సిన విధానాలు, సంక్షేమ చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై తమ విలువైన సూచనలు, సలహాలు అందించాలని కమిటీ కోరింది. ఈ సమావేశం జులై 6 న ఉదయం 10 గంటలకు సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల స్మారక స్థూపం వద్ద నిర్వహించనున్నారు. ఈ కమిటీలో కె. కేశవరావు, పొన్నం ప్రభాకర్, ఎం. కోదండరామ్, అద్దంకి దయాకర్, రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి సభ్యులుగా తెలియజేశారు.

## విద్యుత్ లేని ప్రాంతాలు...

**బేగంబజార్, జులై 3 (ప్రభాతవార్త):** బేగంబజార్ సిబిడి పరిధిలో విద్యుత్ మరమ్మత్తుల కారణంగా శనివారం 11 కెవి విద్యుత్ ఫీడర్లలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు బేగంబజార్ డివిజనల్ఇంజనీర్ అన్నయ్య తెలిపారు.11 కెవి మోతీ మార్కెట్,ఇసామియా బజార్ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా ఉదయం 9గంటల 30నిమిషాల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సంఘం హోటల్,ఎ. కె.భవన్, రైల్వేట్రాక్, ట్రాఫిక్‌పిఎస్,ఇసామియాబజార్, గుజరాత్‌గల్లీ,ఆర్‌టిసి కాంప్లెక్స్, ఆంధ్రాబ్యాంకు తదితర ప్రాంతాలు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.11 కెవి రంగ్ మహల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రంగ్‌మహల్, మెడికల్ కళాశాల,ఆర్‌టిసి కాంప్లెక్స్,అధిత్య ఆసుపత్రి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్‌లు అందజేత



విద్యార్థులకు నోట్ బుక్‌లను అందచేస్తున్న రాకేష్‌జైస్వాల్

**గన్‌ఫౌండ్రి, జులై 3 (ప్రభాతవార్త):** జాంబాగ్ డివిజన్ పరిధిలోని కట్టెలమండి ఆంధ్ర విద్యాలయం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జాంబాగ్ డివిజన్ బిజెపి మాజీ కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ పంపిణిచేశారు. ఈమేరకు రాజ్యసభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ పుట్టిన రోజు సందర్బంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేకకార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు నోట్‌బుక్‌లను అందచేసినట్లు ఆయన చెప్పారు. పేద విద్యార్థులను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో విద్యార్థులకు నోట్ బుక్‌లను అందచేయడం జరిగిందన్నారు. పాఠశాల ప్రధానోఉపాధ్యాయుడు చల్లా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మంచి ఆలోచనతో విద్యార్థులకు నోట్‌బుక్‌లను అందచేయడం సంతోషదాయకమన్నారు. ఈకార్యక్రమలో బిజెపి నాయకులు వి.శంకర్‌కుబేర్, ఠాకూర్ బాలాజీసింగ్, సందీప్‌జైన్, రాజుయాదవ్, సిహెచ్.రవి,పాఠశాల ఉపాధ్యాయులు పి.హేమ,బి. మంజుల,ఎస్.సునీత,బి.జ్యోతి,ఎం.ప్రియా,ఆర్.కవిత,జి.సంగీత,శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# అమనగల్లులో అక్రమ కట్టడం కూల్చివేత

**ఆమనగల్లు, జులై 3 (ప్రభాతవార్త):** అమనగల్లు పట్టణంలో సురసముద్రం చెరువు కాలువపై అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాన్ని గుర్తించిన అధికారులు శుక్రవారం కూల్చివేశారు. 7వ వార్డులోని టీచర్స్ కాలనీ సమీపంలో ఉన్న సురసముద్రం చెరువు కాలువపై అనధికార నిర్మాణం చేపట్టి ప్రహారిని నిర్మిస్తున్నారు. ఇట్టి దానిపై ఫిర్యాదు రాగా, కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి, టౌన్ ప్లానింగ్ విభాగము అధికారులు విచారించి అక్రమ కట్టడాన్ని గుర్తించారు. అక్రమ కట్టడంపై హెచ్చరించి కూల్చివేయాలని ఆదేశించారు. అయినా స్పందన లేకపోయే సరికి సిబ్బంది సహాయంతో అక్రమ కట్టడాన్ని కూల్చివేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ నిర్మాణాలలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని సూచించారు. ప్రభుత్వం నిబంధనలకనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించి నిర్మించే కట్టడాలు ఉపేక్షించేది లేదని తెలిపారు.

# దంపతుల ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

సభ్యులకు సమాచారం ఇచ్చారు.

గురువారం రాత్రి 7:30 గంటలకు ఇద్దరు ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరి జాతీయరహదారి మీదుగా ఘట్‌కేసర్, బీబీనగర్ రైల్వేస్టేషన్ల మధ్యకు చేరుకొని బైక్‌ను నిలిపి రైలు కింద పడి తనువు చాలించారు. మృతులకు 12, 13 సంవత్సరాల ఇద్దరు కుమారులు ఉన్నారని తెలిపారు.

మృతుడు బియ్యం వ్యాపారం చేసేవాడని దంపతలు ఆత్మహత్యకు సంబంధించి కారణాలు తెలియడం లేదని జిఆర్‌పి పోలీసులు తెలిపారు.

మృతదేహాలను పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు పేర్కొన్నారు.

## స్ట్రచ్చర్‌కోడ్ మ్యాపింగ్‌తో నష్టాల నివారణ : డైరెక్టర్ నర్సింహులు



అంబర్‌పేట్‌లోని ఓఇంట్లో మీటర్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్ నర్సింహులు, ఎస్ఈ రమేష్ తదితరులు

**హైదరాబాద్, జులై 3 (ప్రభాతవార్త):** వినియోగదారులకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సాంకేతికత ఆధారిత విద్యుత్ సేవలను అందించాలనే డీటీఆర్, స్ట్రక్చర్ కోడ్‌కు మ్యాపింగ్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని టిజిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్. నరసింహులు అన్నారు. ఈమేరకు శుక్రవారం అంబర్‌పేట్ పరిధిలో స్ట్రచ్చర్‌కోడ్ మ్యాపింగ్‌ను ప్రత్యక్షంగా పరిశీలించారు. డీటీఆర్ స్థాయిలో వినియోగదారుల సేవల ఖచ్చితమైన మ్యాపింగ్ ద్వారా విద్యుత్ నెట్‌వర్క్‌పై సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుందని, దీని ద్వారా లోపాల గుర్తింపు, విద్యుత్ అంతరాయాల విశ్లేషణ, నష్టాల నియంత్రణ. సేవల మెరుగుదలకు ఎంతో దోహదపడుతుందన్నారు. విద్యుత్ వ్యవస్థలో పనిచేసే ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా భద్రతా నిబంధనలను పాటించాలని సూచిస్తూ, పని ప్రారంభానికి ముందు లైన్ క్లియర్ (ఎల్‌సి) పొందడం, వ్యక్తిగత భద్రతా పరికరాలు ధరించడం, ఎర్తింగ్ ఏర్పాటు చేయడం, సేఫ్టీ టూల్స్ వినియోగించడం వంటి అంశాల్లో ఎటువంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. .అలాగే, ప్రతి ఉద్యోగి విధులు నిర్వర్తించి సురక్షితంగా తన కుటుంబ సభ్యుల వద్దకు చేరుకోవడం సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. "సేఫ్టీ ఫస్ట్" అనే భావన ప్రతి ఉద్యోగి ఆచరణలో ప్రతిబింబించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఈ (ఆపరేషన్స్) సెంట్రల్ రమేష్ , ఇన్‌చార్జ్ డీఈ (ఆపరేషన్స్) ఆజాంబాద్, ఏఈ (ఆపరేషన్స్) అంబర్‌పేట్, ఏఈ (ఆపరేషన్స్) గోల్నాక సంబంధిత సిబ్బందితో కలిసి పలు డీటీఆర్‌లను సందర్శించిన డైరెక్టర్ స్ట్రక్చర్ కోడ్ ఆధారంగా వినియోగదారుల సర్వీసుల మ్యాపింగ్ విధానం, బిల్లింగ్ సమయంలో డేటా నమోదు ప్రక్రియ, ఫీల్డ్ స్థాయిలో ఎదురవుతున్న సవాళ్లు వాటి పరిష్కార మార్గాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

## రచనలతో మానవీయ విలువలు చాటిచెప్పిన సాహితీవేత్త కొలకలూరి ఇనాక్

**-కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డాక్టర్ నందిని సిధారెడ్డి**



ప్రముఖ రచయిత విహారి రచించిన అపూర్వ గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డాక్టర్ నందిని సిధారెడ్డి

**చిక్కడపల్లి జులై 3 ( ప్రభాతవార్త ) :** తెలుగు సాహితీచరిత్రలో అన్ని ప్రక్రియలను స్పృశించిన మహాకవి ఆచార్య కొలకలూరి ఇనాక్ అని కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో ప్రఖ్యాత సాహితీ వేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహం కార్యక్రమ లో భాగంగా ప్రముఖ రచయిత విహారి రచించిన అపూర్వ గ్రంథావిష్కరణ సభ గానసభ అధ్యక్షుడు కళావిఎస్ జనార్ధనముర్తి అధ్యక్షతన జరిగింది. గ్రంథాన్ని ఆవిష్కరించిన అనంతరం డాక్టర్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ సాహిత్యాన్ని కేవలం వినోద సాధనంగా కాకుండా సామాజిక మార్పునకు ఆయుధంగా మలిచిన మహోన్నత రచయిత ఇనాక్ అని అన్నారు. దళిత సాహిత్యానికి ఆయన అందించిన దిశానిర్దేశం చిరస్మరణీయమని, సమాజంలోని అణగారిన వర్గాల జీవితాలను సాహిత్యంలో ప్రతిష్ఠించి తెలుగు సాహిత్యానికి కొత్త దృక్పథాన్ని అందించారని చెప్పారు. విహారి మాట్లాడుతూ కొలకలూరి ఇనాక్ సాహిత్య వారసత్వాన్ని భావితరాలకు అందించడం ప్రతి సాహిత్యాభిమాని బాధ్యత అని, ఆయన రచనలను విస్తృతంగా అధ్యయనం చేయాలని పిలుపునిచ్చారు. తెలుగు సాహిత్యంలో ఇనాక్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ఆచార్య కొలకలూరు ఇనాక్ మాట్లాడుతూ విహారి రచించిన అపూర్వ పాఠకులను ఆలోచింపజేసే, సాహిత్య విలువలను ప్రతిబింబించే గ్రంథమని కొనియాడారు.

## వైభవంగా వానదేవత విగ్రహ ప్రతిష్టానోత్సవం



బండ్లగూడలో వానదేవత సహిత కాటంరాజు విగ్రహంను ఆవిష్కరిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

**నార్సింగి, జులై 3 (ప్రభాతవార్త):** రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ డివిజన్‌లో శుక్రవారం వానదేవత సహిత కాటంరాజు విగ్రహ ప్రతిష్టాపనోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచరణలు, మంగళ వాయిద్యాలు, వందలాది మంది భక్తజనుల జయ జయ ధ్వనుల మధ్య శాస్త్రోక్తంగా ఈ వేడుక నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంత ఉన్నత స్థానాలకు ఎదిగినా... మన సంస్కృతీ, సాంప్రదాయాలు, ఆచారాలను మనం పాటిస్తూ భావి తరాలకు అందించాలని సూచించారు. పండగలు మన ఆచారాలను భావి తరాలకు అందించే వారధులని వివరించారు. సనాతన ధర్మంలో నిర్వహించే ప్రతీ పండగ వెనుకాల ఓ ఆరోగ్య రహస్యం ఇమిడి ఉందని తెలిపారు. కాటంరాజు, వానదేవతల ఆశిస్సులతో రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలంతా పాడిపంటలు, సుఖ సంతోషాలతో ఉంటారని పేర్కొన్నారు. గౌడ సామాజిక వర్గం అభ్యున్నతికి నావంతు పూర్తి సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం సైతం గౌడకుల అభివృద్ధికి అనేక సంక్షేమ పతకాలను సమర్థవంతంగా అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ బి.మహేందర్‌గౌడ్, సహకార సంఘం చైర్మన్ రాందాస్ ముదిరాజ్, మాజీ కార్పోరేటర్ సాగర్‌గౌడ్, నాయకులు పాపయ్య యాదవ్, సురేష్‌గౌడ్, సుమన్‌గౌడ్ పాల్గొన్నారు.

## గంజాయి కలిగి ఉన్న వ్యక్తి అరెస్ట్

**కొంపల్లి, జులై 3 (ప్రభాతవార్త):** గంజాయి కలిగి ఉన్న నిందితుడిని బాచుపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం ఒడిస్సా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన, ప్రస్తుతం గుజరాత్ రాష్ట్రంలోని సూరతుల నివాసం ఉంటున్న కృష్ణ జనా (29) అను వ్యక్తిని శుక్రవారం బాచుపల్లి చౌరస్తాలో అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో బాచుపల్లి పోలీసులు అతనిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 13కిలో గ్రాముల గంజాయిని ఏడు ప్యాకెట్లలో ఉండడంతో దానిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఉపయోగించిన సెల్ ఫోన్‌ని కూడా పోలీసులు సీజ్ చేశారు. పోలీసుల విచారణలో నిందితుడు ఒడిస్సా నుంచి గంజాయిని సేకరించి, అక్రమంగా గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో విక్రయించడానికి గంజాయిని తీసుకొచ్చినట్లు అంగీకరించాడు. ఈ కేసులో ఒడిస్సా రాష్ట్రంలోని బలుగాకు చెందిన జిల్లా అనే వ్యక్తి సహకారం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతను ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### గౌడుల జీవన గాథలకు మోకు అక్షరరూపం

**చిక్కడపల్లి జులై 3 (ప్రభాతవార్త):** గౌడుల జీవన విధానం, వృత్తి, సంస్కృతి, సామాజిక అనుబంధాలను ప్రతిబింబించే మోకు - గౌడు బతుకు కథల్లు కథా సంకలనాన్ని శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ వెల్దండ నిత్యానందరావు ఆవిష్కరించి ప్రసంగించారు. గౌడ వృత్తి సమాజంలోని అన్ని వర్గాలతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉంటుందని, అందరికీ కల్లు అందించి జీవన విధానంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని ఆయన పేర్కొన్నారు. గౌడుల సాహిత్యానికి తొలి కథా సంకలనంగా నిలుస్తుందని, ఇలాంటి సంకలనాలు ఇతర సంప్రదాయ వృత్తులపైనా రావాలని ఆకాంక్షించారు.

# ప్రాచీన అడుగుల భజనతో దద్దరిల్లిన తెలంగాణ ప్రజాకళ

**రవీంద్రభారతి, జులై 3 (ప్రభాతవార్త):** తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల కళామందిరం) ఆరుబయలు కళావేదికలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి నేతృత్వంలో 99 రోజులపాటు నిర్విరామంగా జరుగుతున్న సాంస్కృతిక మహోత్సవం తెలంగాణ ప్రజాకళ 93వ రోజు ప్రాచీన కళారూపం అడుగుల భజనతో జానపద కళాప్రదర్శనతో దద్దరిల్లింది. వికారాబాద్ జిల్లా బాపురం శ్రీకాంత్ బృందంచే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిమళాన్ని గుభాళింపజేస్తూ ఉవ్విళ్లూరించిన అడుగుల భజన కళాప్రతిభకు అద్దంపడుతూ విచ్చేసిన అశేష ప్రేక్షకులను తన్మయుల్నిచేసి మంత్రముగ్ధులను కావించింది. కళాకారులు శ్రీకాంత్, కృష్ణ, మణికంఠ, వినయ్, గణేష్, కిరణ్, సాయికుమార్, రాంచరణ్, శ్రీశైలం, అర్జున్, సందీప్, మహేష్, వినోద్, సాయిరాం, విష్ణు తదితరులు తమ అడుగుల విన్యాసంతో ఉర్రూతలూగించారు.

ప్రధాన కార్యక్రమానికి ముందు తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ప్రభాతభేరి గీతాలతోపాటు జానపద, సామాజిక చైతన్యగీతాలను తమదైనశైలి ఆలపించి అబ్బురపరిచారు. విద్యానందచారి, శ్రీనివాస రాజులు వ్యాఖ్యానంతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన తెలంగాణ ప్రజాకళ సాంస్కృతిక మహోత్సవ సభాకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. ఏనుగు నరసింహారెడ్డి విశిష్ట అతిథులు పి.నర్సింలు, డా. పి.విజయ్‌కుమార్, ముచ్చర్ల దినకర్ తదితరులతో కలిసి కళాకారులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

## టెక్నాలజీకే టోకరా

(మొదటి పేజీ తరువాయి)

వదిలేసి వారి వెనుక తిరిగేందుకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తు బోధనను పూర్తిగా గాలికొదిలేశారు. గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు కూడా ఈ వ్యవహారంలో ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో విద్యా వ్యవస్థ పూర్తిగా గాడి తప్పుతోంది. జిల్లాలోని 1066 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న దాదాపు 65 వేల మంది పేద విద్యార్థుల భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

**కొత్త డీఈవోకు ఉపాధ్యాయ సంఘం నేతలు ఫిర్యాదు**

ఇతర జిల్లాల్లో ఇలాంటి యాప్ దుర్వినియోగంపై విద్యాశాఖ ఇప్పటికే సీరియస్ అయి, హెచ్చరిక లేఖలు జారీ చేసింది. ఈ క్రమంలోనే వికారాబాద్ జిల్లాలో జరుగుతున్న ఈ దందాపై ఒక ఉపాధ్యాయ సంఘం నేతలు కొత్తగా బాధ్యతలు చేపట్టిన డీఈఓ మనీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన డీఈఓ, త్వరలోనే జిల్లాలోని పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. డిజిటల్ అటెండెన్స్ వేసి డ్యూటీకి ఎగనామం పెడుతున్న వారి ఆటలకు కొత్త డీఈఓ అయినా బ్రేక్ వేస్తారో లేదో చూడాలి.

## సస్పెండ్ చేసి పడేస్తా

(మొదటి పేజీ తరువాయి)

ఈ వ్యవహారం వెనుక కొందరు కావాలనే పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు వినిపించాయి. ము ఖ్యంగా మాజీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి ఈ వ్యవ హారం వెనుక ఉన్నారంటూ సమావేశంలో ఆరోపణలు చేయడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ వ్యాఖ్యలకు సంబం ధించిన వీడియో క్లిప్పింగులు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

**ముదురుతున్న వర్గపోరు**

ఒకవైపు డివిజన్ అధ్యక్ష నియామకంపై అసంతృప్తి, మరోవైపు అంతర్గత లేఖల లీకేజీ, పేర్ల మార్పుపై ఆరోపణలు, సస్పెన్షన్ హెచ్చరికలు, మాజీ జిల్లా అధ్యక్షుడిపై సంచలన విమర్శలు ఇలా గుండ్లపోచంపల్లి కాంగ్రెస్‌లో వర్గపోరు బహిరంగంగా బయట పడింది. ఈ పరిణామాలపై పార్టీ అధిష్ఠానం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే అంశం ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## వైరల్ హెపటైటిస్‌పై ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న రాపిడ్ డయాగ్నస్టిక్ టెస్ట్ (ఆర్‌డీటీ) కిట్ల ద్వారా హెపటైటిస్‌బి, హెపటైటిస్‌సి పరీక్షలను మరింత విస్తరించాలని తెలిపారు. పాజిటివ్‌గా గుర్తించిన వారికి వెంటనే చికిత్స అందేలా అన్ని వైద్య సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అధిక ప్రమాదంలో ఉన్న వర్గాలు, ముఖ్యంగా ఆరోగ్య సిబ్బందికి హెపటైటిస్‌బి టీకాను వందశాతం అందేలా చర్యలు తీసుకోవాలని, అలాగే అధిక ప్రమాద ప్రాంతాలు, కమ్యూనిటీలలో ప్రత్యేక వైద్య శిబిరాలు, పరీక్షలు, టీకా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ ద్వారా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రార్థనా సభలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాల సందర్భంగా వైరల్ హెపటైటిస్ వ్యాధి, దాని వ్యాప్తి మార్గాలు, నివారణ చర్యలు, ప్రమాదకర ప్రవర్తనలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే ఆర్‌బీఎస్‌కే బృందాలు పాఠశాలలను సందర్శించి యుక్తవయస్కుల్లో ఆరోగ్యకర జీవనశైలిపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వైరల్ హెపటైటిస్‌ను ప్రజారోగ్య సమస్యగా పూర్తిగా నిర్మూలించాలంటే అన్ని ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, భాగస్వామ్య సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి పేర్కొన్నారు.

## దోమ పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తగా ఉండాలి

**కొడంగల్ రూరల్, జులై 3 (ప్రభాతవార్త):** దోమ పుట్టకుండా, కుట్టకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వికారాబాద్ జిల్లా వైద్యాధికారి సుధాకర్‌లాల్ అన్నారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

### రూ.1 లక్ష విరాళం అందజేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

**మేడ్చల్, జులై 3 (ప్రభాతవార్త):** ఎల్లంపేట మున్సిపాలిటీలోని శ్రీరంగవరం గ్రామంలో గల క్రీడా మైదానం అభివృద్ధి పనుల కొరకు మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తన వంతు సహకారంగా రూ. 1 లక్ష విరాళాన్ని అందజేశారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో గ్రామ యువకులకు ఈ విరాళాన్ని అందజేసి యువకులు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకుని తనకిష్టమై ఆటల్లో రాణించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు.

## బాధ్యతతో పనిచేయండి

(మొదటి పేజీ తరువాయి)

అనే లక్ష్యంతో పనిచేయాలని అధికారులను, సిబ్బందిని కోరారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వార్డులో ఎలాంటి సమస్యలు రాకుండ చూడాలని, సమస్య వస్తే వెంటనే అధికారులు, సిబ్బంది స్పందించి పరిష్కరించాలని చైర్మన్ జాము రవి సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే ముఖ్యంగా భావించి సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులు, సిబ్బంది చూడాలని చైర్మన్ ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ మోహన్‌సింగ్, మల్లిఖార్జున్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కెటిఆర్ సభలో జేబు దొంగల ముఠా అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

అఫ్జల్ సాగర్, మంగర్‌బస్తీ ప్రాంతాల్లో అరెస్టు చేసినట్లు తెలిపారు. కాంబ్లే ప్రీతమ్, రిజ్వాన్, మోడల్ శ్రీను పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయని చెప్పారు. అరెస్టు చేసిన నిందితుల వద్ద నుంచి రూ.95 వేల నగదు, 30 గ్రాముల రెండు బంగారు గొలుసులు, 64 గ్రాముల రెండు బంగారు గొలుసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## ఇదేం పాకిస్థాన్ కాదు: కానిస్టేబుల్ వ్యాఖ్యలు

**అంతర్గత విచారణ ప్రారంభించిన సైబరాబాద్ పోలీసులు**

**హైదరాబాద్ జులై 3 (ప్రభాతవార్త):** పార్కింగ్ విషయంలో ఒక మహిళతో తలెత్తిన వివాదంలో "ఇదేమీ పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ కాదు" అంటూ మతపరమైన వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ విభాగం అధికారులు ఒక కానిస్టేబుల్‌పై అంతర్గత విచారణ చేపట్టారు. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం గచ్చిబౌలి రాయదుర్గం మార్గంలోని ఐకియా ఎగ్జిట్ వద్ద గల బీపీ పెట్రోల్ బంక్ సమీపంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు అందించిన ఫిర్యాదు ప్రకారం, ఒక మహిళ, ఆమె కుమారుడు తమ మోటార్‌సైకిల్‌ను బారికేడ్ల వెనుక ఇతర వాహనాలతో పాటు పార్క్ చేశారు. వారు తిరిగి వచ్చిన తర్వాత బారికేడ్లను తొలగించాలని ట్రాఫిక్ కానిస్టేబుల్ జె. మల్లేశంను కోరగా, ఆయన అందుకు నిరాకరించారు. ఈ క్రమంలో కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తిస్తూ, "మీకు నచ్చిన చోట వాహనాలు పార్క్ చేయడానికి ఇదేమీ పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ కాదు" అని అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్ స్పందిస్తూ, సదరు కానిస్టేబుల్‌పై అంతర్గత విచారణ ప్రారంభించామని, విచారణ పూర్తయిన తర్వాత నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, వివాదం జరుగుతున్న సమయంలో కానిస్టేబుల్ తన వ్యక్తిగత ఫోన్‌లో సంభాషణను రికార్డు చేశాడని బాధితుడు సమీర్ తన ఫిర్యాదులో వెల్లడించారు.

### కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు అహర్నిషలు శ్రమిస్తా : నర్సిహ్మా

**నార్సింగి, జులై 3 (ప్రభాతవార్త):** రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు అహర్నిషలు శ్రమిస్తానని జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు రామేశ్వరం నర్సిహ్మా పేర్కొన్నారు. శుక్రవారం పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఈ మేరకు నూతన కార్యవర్గ సభ్యుల జాబితాను విడుదల చేశారు. గండిపేట మండలం ఖానాపూర్ గ్రామ సర్పంచ్‌గా సహర్థవంతంగా బాధ్యతలు నిర్వహించి ప్రజల మన్ననలు పొందిన, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ప్రధాన అనుచరుడిగా పేరొందిన రామేశ్వరం నర్సిహ్మాకు జిల్లా ఉపాధ్యక్షుడి బాధ్యత వరించింది. పార్టీలోని జూనియర్, సీనియర్ నేతలందరిని కలుపుకొని, పార్టీ పటిష్టతకు అంకిత భావంతో పని చేస్తానని తెలిపారు. నర్సిహ్మాకు జిల్లా ఉపాధ్యక్షుడి బాధ్యత వచ్చిందని తెలుసుకున్న గండిపేట మండల కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు శుభాకాంక్షలు తెలిపారు.

## అక్రమంగా గంజాయి కలిగిఉన్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

**'2,334 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు**

**చార్మినార్, జులై 3 (ప్రభాతవార్త):** అక్రమంగా గంజాయి కలిగి యున్న ఇద్దరు నింధితులను భవానీ నగర్ పోలీసులు శుక్రవారం అరెస్ చేశారు. నింధితుల వద్ద నుంచి 2,334 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం...భవానీనగర్‌కు చెందిన మహ్మద్ నసీర్ (43),మహ్మద్ మెహరాజ్ అలీ (24) పాతబస్తీ తలాబ్‌కట్ట రైల్వే ట్రాక్ ప్రక్కన నెంబరు లేని ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తున్నారు. అనుమానం వచ్చిన పోలీసులు ఇద్దరిని అదుపులోకీ తీసుకుని విచారించగా వారి వద్ద నుంచి 2,334 కిలోల గంజాయి లభించింది. ద్విచక్ర వాహనం,మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును భవానీనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# మద్యం మానేయమన్నందుకు భార్యను చంపిన భర్త

**కొంపల్లి, జులై 3, ప్రభాతవార్త :** మద్యం మానేయమన్నందుకు భార్యను చంపివేసి ఆత్మహత్యగా పోలీసులను నమ్మించిన భర్తను బాచుపల్లి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా ఎడ్లపాడు మండలం కొత్త సొలస గ్రామానికి చెందిన కిలారు బాలకృష్ణకు, నాదెండ్ల మండలం సంక్రాంతి పాడు గ్రామానికి చెందిన భార్గవితో 2014లో వివాహం జరిగింది. వివాహం అనంతరం వారు బాచుపల్లిలోని రాజీవ్ గాంధీ నగర్ సమీపంలో జయదీపిక ఎస్టేట్లో నివాసం ఉంటున్నారు. వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న బాలకృష్ణ కొంతకాలంగా మద్యానికి బానిసై కుటుంబ బాధ్యతలను పట్టించుకోకపోవడంతో భార్య భార్గవి పలుమార్లు భర్తను మద్యం మానివేయాలంటూ ఒత్తిడి తెచ్చింది. అయితే భార్య మాటలను అవమానకరంగా భావించిన బాలకృష్ణ గత కొన్ని నెలలుగా భార్యపై శారీరక, మానసిక వేధింపులు పెంచాడు. పిల్లలకు సెలవులు రావడంతో భార్గవి తన పుట్టింటికి వెళ్ళగా, ఏప్రిల్ 25న బాలకృష్ణ తన సోదరుడితో కలిసి మద్యం మత్తులో అక్కడికి చేరుకొని భార్యతో పాటు అతను దుర్భాషలాడినట్లు తెలిసింది. అంతేకాకుండా భార్గవి సోదరుని చంపేస్తానంటూ బెదిరించినట్లు సమాచారం. దీంతో భార్గవి తిరిగి అత్తారింటికి వెళ్లేందుకు నిరాకరించింది. అనంతరం బాలకృష్ణ తల్లిదండ్రులు జోక్యం చేసుకొని భద్రత కల్పిస్తామని హామీ ఇవ్వడంతో జూన్ 13న ఆమె తిరిగి భర్త వద్దకు వచ్చింది. అయితే ఇంటికి వెళ్లిన మొదటి రోజే బాలకృష్ణ మద్యం సేవించి భార్యపై బెల్టుతో దాడి చేసి గాయపరిచాడు.

ఆ తర్వాత కూడా ప్రతిరోజు వేధింపులు కొనసాగాయని తెలుస్తుంది. జూన్ 20న ఉదయం నుంచి మద్యం సేవించిన బాలకృష్ణ భార్గవిపై అక్రమ సంబంధాల ఆరోపణలు చేస్తూ ఇంటి బయట అవమానించాడని మృతురాలి బంధువులు తెలిపారు.

ఈ విషయాన్ని భార్గవి తన సోదరుడికి ఫోన్ చేసి తెలిపింది. వెంటనే పుట్టింటికి రావాలని వారు కోరిన మరికొద్ది రోజులు ఎదురు చూస్తానంటూ ఆమె సమాధానం ఇచ్చింది. అదే రోజు ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ఈ రోజే నువ్వు ఉరివేసుకొని చస్తావు అని బెదిరించిన బాలకృష్ణ రాత్రి తిరిగి వచ్చి భార్గవిని గొంతు నులిమి హత్య చేసినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మృతదేహాన్ని సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడదీసి ఆత్మహత్యగా కనిపించేలా నిందితుడు ప్రయత్నించినట్లు తెలిసింది.

పిల్లలకు కూడా తల్లి ఉరేసుకుందని చెప్పి అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారని బంధువులు పేర్కొన్నారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు అనుమానాస్పద స్థితిలో మరణించినట్లు కేసు నమోదు చేశారు. అనంతరం విచారణలో బాలకృష్ణ పొంతనలేని సమాధానం చెప్పడంతో పోలీసులు తమ స్టైల్‌లో ప్రశ్నించగా భార్యను తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. దీంతో బాచుపల్లి పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు.



పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న పాలకవర్గం

## పిఏసిఎస్ ఛైర్మన్ భీంరెడ్డి బాధ్యతలు స్వీకరణ

**రైతుల సంక్షేమానికి కృషి చేయాలి**

**కుల్కచర్ల, జులై 3 ప్రభాతవార్త:** రైతులకు అవసరమైన స్వల్పకాలిక మరియ దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలను ఇచ్చి రైతుల సంక్షేమానికి కృషి చేయాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకు ఛైర్మన్‌గా బోలుసాని భీంరెడ్డి, వైస్ ఛైర్మన్ ఎలుపటి ఆశోక్ కుమార్, డైరెక్టర్లు మాణెమ్మ, చిన్నయ్య, ప్రకాష్‌రెడ్డి, ఆనందం, కృష్ణయ్య, చెన్నయ్య, పి. వెంకటయ్య, సి. వెంకటయ్య, ఇ. హనుమంతు, ఎం. బాల్య, కె. దామోదర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్బంగా నూతన ఛైర్మన్ బోలుసాని భీంరెడ్డి మాట్లాడుతూ...పిఏసిఎస్ ద్వారా రైతులకు మెరుగైన సేవలందించేందుకు శక్తివంచనలేకుండా పని చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటి ఛైర్మన్ ఆంజనేయులు, రైస్‌మిల్ అసోసియన్ జిల్లా అధ్యక్షులు బోలుసాని శ్రీధర: రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, చౌడపూర్ మండల అధ్యక్షులు చంద్రశేఖర్, అయా గ్రామాల సర్పంచులు, నాయకులు కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



ఇందిరమ్మ గృహప్రవేశ పూజలో పాల్గొన్న ధారాసింగ్

**పెద్దేముల్, జులై 3, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వికారాబాద్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ధారాసింగ్ అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండలం బుద్దారం గ్రామంలో సడాకు లక్ష్మికి చెందిన నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశ పూజ కార్యక్రమానికి ధారాసింగ్ హాజరయ్యారు. ఈ సందర్బంగా ధారాసింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం పేద లందరికి గౌరవప్రదమైన గృహన్ని అందించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ళ పథకాన్ని అమలు చేస్తోందని అన్నారు. ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవం, అభివృద్దికి పునాది అని అన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి పారదర్శకంగా ఇళ్ళు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇంటి లబ్దిదారులైన సడాకు లక్ష్మి కుటుంబానికి శుభాకాంక్షలు తెలుపుతు, వారి జీవితం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు లొంక నర్సిములు, మండల పార్టీ మాజీ అధ్యక్షులు కొండపురం గోపాల్, మాజీ సర్పంచ్ రెగొండి వెంకటయ్య, రాములు, మోతె లక్ష్మన్, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు ప్రజాస్వామ్యానికి పునాది

**సర్పంచ్ గుడిసె చంద్రకళ**



మాట్లాడుతున్న యంఈఓ నర్సింగ్‌రావు

**పెద్దేముల్, జులై 3, ప్రభాతవార్త:** ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని, అందుకు అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని తింసాన్‌పల్లి సర్పంచ్ గుడిసె చంద్రకళ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దేముల్, తింసాన్‌పల్లి, గోపాల్‌పూర్ గ్రామాలలో నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ పారాలను అందజేశారు. ఈ సందర్బంగా సర్పంచ్ చంద్రకళ మాట్లాడుతూ ఓటరు జాబితా తాజాగా, ఖచ్చితంగా ఉంచడం కోసమే సర్ కార్యక్రమమని అన్నారు. అర్హులైన కొత్త ఓటర్లను నమోదు చేయడం, మరణించిన లేదా, చిరునామ మార్చిన వారి పేర్లను తొలగించెందుకే సర్ ప్రకియ అని అన్నారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కు ఓటర్ జాబితాలో ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి మైనార్టీ కన్వీనర్ యండి. రియాజ్, బిఎల్ఓ గుడిసె ఉమాదేవి, బిఎల్‌ఏలు బుద్దారం నాగేష్, ఏక్బాల్, చాకలి రవి, రొంపల్లి మల్లయ్య, గోపాల్‌పూర్ బిఎల్ఏ బోయిని శివకుమార్, గ్రామ కమిటి అధ్యక్షులు అనిఫ్, ఉపాధ్యాక్షులు పల్లె రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

### రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా బొక్క జంగారెడ్డి

**కందుకూరు, జులై 3, (ప్రభాతవార్త):** కందుకూరు మండలం మాజీ జెడ్పిటిసి బొక్క జంగారెడ్డిని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షు లుగా నియమిస్తూ రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా లేమూరు గ్రామ నివాసి ఢిల్లీ శ్రీధర్ ను జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. నియామక పత్రాలను మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి చేతులమీదుగా అందు కున్నారు. ఈ సందర్బంగా కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పార్టీ పదవులను పొందిన ప్రతినిధులు ప్రభుత్వానికి ప్రజలకు వారదులుగా నిలిచి పార్టీకి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని ఆయన సూచించారు. సందర్బంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తమపై నమ్మకంతో జిల్లా పార్టీ ప్రతినిధులుగా నియమించడం బాధ్యతలను మరణించి పెంచిందన్నారు. ఈ సందర్బంగా జిల్లా పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి, మరియు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ వారి నమ్మకాన్ని పంపి చేయకుండా జిల్లాలో పార్టీ అభివృద్ధికి తమ వంతు బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించి పార్టీని బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు మండల స్థాయి కమిటీలతో సమన్వయం చేసుకుంటూ అందరికీ అందుబాటులో ఉంటూ కేంద్ర పార్టీ ఆదేశాలను అమలు చేస్తూ అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు సమాధావంతంగా అందేలా చొరవ చూపడం జరుగుతుందన్నారు. రాబోయే ఏ ఎన్నికలైనా కాంగ్రెస్ గెలిపి లక్ష ్యంగా పనిచేయడం జరుగుతుందని మారుపేరుకొన్నారు. సందర్బంగా జిల్లా స్థాయి పదవులు అందించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామచంద్రారెడ్డి, వెంకట్ రామ్ రెడ్డి, సరికొండ మల్లేష్, సరికొండ జగన్, అండె కార్ సురేందర్, తదితరులు పాల్గొన్నారు



# పోలీస్‌స్టేషన్‌ను మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలి

**జిల్లెడు చౌదరిగూడ, జులై 3, (ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోనే నూతన పోలీస్‌స్టేషన్‌ను మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌కు మండల జెఏసి నాయకులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల చరిత్ర జిల్లేడు సంస్థానం , చౌదర్ గూడ మార్కెట్ వ్యాపార కేంద్రం , బ్యాంకులు, విద్యా సంస్థలు, ఇలా ఎన్నో సౌకర్యాలు ఉన్న స్థలాన్ని వదిలి వేరే చోట పోలీస్టేషన్ ను ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ఎవరి ప్రయోజనాల కోసం లల్‌పహాడ్‌లో నూతన పోలీస్‌స్టేషన్‌ను భవనాన్ని నిర్మిస్తున్నారని అన్నారు. ప్రజల ప్రయోజనాలు, దూరదృష్టితో నిర్ణయాలు తీసుకోవాలని వారు పెర్కొన్నారు. తాత్కాలికంగా మోనం చేస్తే శాశ్వతంగా ప్రజలకు నష్టం జరుగుతోందని అన్నారు. అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రజా అభిప్రాయ సేకరణ చేసి ప్రజల తీర్పుపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెఏసి నాయకులు మచ్చ సుధాకర్ రావు, సయ్యద్ హాఫీజ్ , పడకంటి వెంకటేష్, ఎదిర రాజు, వర్కల శివరాజు, బోయ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న జెఏసి నాయకులు

# తాండూరుని మోడల్ సిటీగా తీర్చిదిద్దుదాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**తాండూరు, జులై 3, ప్రభాతవార్త :** తాండూరు మున్సిపాల్టీని మోడల్ సిటీగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ నీరజా అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్య అథితిగా హజరయ్యారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా పట్టణ అభివృద్దికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. తాండూరు మున్సిపాల్టీని మోడల్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. ప్రజలకు మంచి చేయడమే మన ఎజెండాగా ముందకు సాగాలని, స్వపక్షం, ప్రతిపక్షం తేడా లేకుండా అందరు కలిసి ప్రజల పక్షంగా పనిచేయాలని సూచించారు. పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ది పథంలో ముందకు తీసుకువెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకు అనుగుణంగా మౌళిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, కమిషనర్ రాకేష్ రెడ్డి, వివిద పార్టీల ఫ్లోర్‌లీడర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రామ్మోన్ రెడ్డి కోసం 30 సంవత్సరాలు పనిచేసిన!

**కుల్కచర్ల, జులై 3, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీలో 30 సంవత్సరాలు ఎమ్మెల్యే రామ్మోన్ రెడ్డి కోసం అను క్షణం పనిచేస్తూ అయన గెలుపు కోసం కిలక పాత్ర పోషించానని కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు పెంటమిది వెంకటయ్యగౌడ్ అన్నారు. అయకు పిఏసిఎస్‌లో డైరెక్టర్ పదివి ఇచ్చినందుకు అవమనంగా ఉందని శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే రామ్మోన్ రెడ్డి అనుచరుడిగా ఎటువంటి మచ్చ లేకుండా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా5 సంవత్సరాలు కొనసాగినా, ఒక సారి డిసిసి ఉపాధ్యక్షుడిగా పనిచేసిన, అన్నీ ఎమ్మెల్యే రామ్మోన్ రెడ్డి గెలుపు కోసం రాత్రి పగలు కష్టపడ్డ అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసే క్రమంలో రెండు సార్లు రోడ్డు ప్రమాదాలకు గురైౖ ఒక కాలు మరియు చేయి కూడా ఫ్రాక్చర్ అయిందని, ఇటివల డ్రోన్ ప్రమాదంలో కూడా తన కాలుకి తీవ్ర గాయాలు కూడ అయిందని బాధపడ్డారు. పార్టీ కోసం తన జీవితం అంత పని చేసుకుంటున్నప్పటికి ఒక్క సారి పిఏసిఎస్ చైర్మన్ పదవి అడగితే అంగికరించి చిన్న చూపుగా డైరెక్టర్ ఇవ్వడం సరికాదన్నారు. ఇంతకు ముందు చైర్మన్ పదవి చేసిన వారికి ఇవ్వడం న్యాయం కాదని అన్నారు. తన స్థాయికి డైరెక్టర్ పదవి అవసరం లేదని అవేదన వ్యక్తం చేశారు. తన వయస్సును, పార్టీకి చేసిన సేవలను ఎమ్మెల్యే రామ్మోన్ రెడ్డి గుర్తించి గౌవర స్థాయి పదవి ఏర్పాటు చేయాలని కోరారు. డైరెక్టర్ పదవి రాజీనామాకు సిద్దపడినట్లు తెలిపారు.

## కెజిబివిలో 6వ తరగతికి ప్రవేశ పరీక్ష

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లాలో ఎంపికైన 3 కెజిబివి కేంద్రాల్లో (నేవికారాబాద్, దోమ, కొడంగల్) యంగ్ ఇండియా ఇనిస్ట్యూట్ అఫ్ ఎక్స్‌లెన్స్‌లలో ఈనెల 12 తేదిన 6వ తరగతికి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా విధ్యాధికారి ఎండీ. అబ్దుల్ ఘని తెలిపారు. పరీక్ష ఉదయం 11 గంటల నుండి 1 గంట వరకు జరుగుతాయని అన్నారు. ఎంపికైన విద్యార్డులకు ఆరవ తరగతి నుండే జాతీయస్దాయిలో జేఈఈ, నీట్, క్లాట్ వంటి పోటీ పరీక్షలకు అనుగుణంగా బోధన చేయబడునని తెలిపారు. మంచి హస్టల్ వసతి, నాణ్యమైన బోధన, ఎస్ఓపి ద్వారా రుచికరమైన భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు, వర్క్ బుక్స్, ఏకరూప దుస్తులు, దుప్పట్లు తదితర వస్తువులను అందించడం జరుగుతుందన్నారు. విద్యార్డులకు అకాడమిక్‌తో పాటు యోగ, కరాటే, ఆటలు, ప్రయోగశాలలు, గ్రంధాలయము, ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా, టైలరింగ్, కంప్యూటర్ బోధన, ఆర్ట్‌క్రాఫ్ట్ వంటి కోర్సులు విద్యార్డులకు అందించబడునని తెలిపారు. పూర్తి వివరాలకు సంభందిత కెజిబివి కేంద్రాల్లో స్పెషలాఫీసర్లను సంప్రదించగటరని డీఈఓ తెలిపారు.

## పరిగి పిఎసిఎస్ చైర్మన్ గా పార్థసారథి

**పరిగి, జులై 3, ప్రభాతవార్త :**వికారాబాద్ జిల్లా ,పరిగి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ నూతన చైర్మన్‌గా పార్థసారథి ,వైస్ చైర్మన్‌గా రాజపుల రెడ్డి శుక్రవారం ప్రమాణ భాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి హాజరై , ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన సేవలను పారదర్శకంగా అందించాలని పిఏసిఎస్ ను అభివృద్ధి పరిచాలని తెలిపారు. పరిగి ప్రాథమిక వ్యవసాయ సంఘానికి అనధికార ప్రతిపాదిత సభ్యులను ప్రకటించారు. డైరెక్టర్లుగా చిన్న నర్సింలు, నాగవర్ధన్, జనార్ధన్, రమేష్ రెడ్డి, రహీం పటేల్ డి. దివ్య, సత్యనారాయణ రెడ్డి, మల్లేష్ , హరిశ్చంద్ర నాయక్, కవలి జలమ్మ, వెంకటయ్యలు జాబితాలో ఉన్నారు.

## నేడు ఎస్‌సి కార్పొరేషన్ లబ్ధిదారుల ఎంపిక

**..యంపిడిఓ తిరుమలస్వామి**

**పెద్దేముల్, జులై 3, ప్రభాతవార్త:** ఈ నెల4న (నేడు) శనివారం నాడు పెద్దేముల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎస్‌సి కార్పోరేషన్ లబ్దిదారుల ఎంపికకోసం ఇంటర్వ్యులు నిర్వహిస్తున్నట్లు యంపిడిఓ తిరుమలస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్బంగా యంపిడిఓ తిరుమలస్వామి మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాజరు కావాలని కోరారు.

## పుట్‌ఫాత్‌పై నిద్రిస్తున్న వ్యక్తిని హత్యచేసిన దుండగులు

**బేగంపేట జులై 3, ప్రభాతవార్త**

రాంగోపాల్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో పుట్‌ఫాత్‌పై నిద్రిస్తు న్న వ్యక్తి హత్యకు గురవడం కలకలం రేపింది. పీ. జీ. రోడ్డులోని పార్శీ ధర్మశాల గేటు సమీపంలో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న కన్నా అనే వ్యక్తిని గుర్తు తెలియని దుండగులు పదునైన ఆయుధంతో తలపై మోదీ దారుణంగా హత్యచేసారు. రాంగో పాల్‌పేట ఇన్స్‌పెక్టర్ బి. సురేష్ కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బన్సీలాల్ పేట డబుల్ బెడ్ రూం ఇండ్ల లో నివసించే మహ్మద్ తాజ్ గత 40ఏళ్లుగా పార్శీ ధర్మశాల గేటు పక్కన పూల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన దుకాణానికి ఎదురుగా నవీన్ కుమార్ అనే వ్యక్తి స్క్రాప్ (పాతసామాన్లు) దుకాణం నడుపుతున్నాడు. ఈ స్క్రాప్ దుకాణానికి కన్నా, సిరాజ్ అనే ఇద్దరు వ్యక్తులు ప్రతి రోజు పాత పేపర్లు సేకరించి అమ్ముతుండేవారు. రాత్రి కాగానే పార్శీ ధర్మశాల గేటు ఎదురుగా కన్నా, అతనికి కొద్ది దూరంలో సిరాజ్ లు నిద్రించేవారు. ప్రతి రోజు ఉదయం పూల వ్యాపారి తాజ్ ,స్క్రాప్ దుకాణ దారుడు నవీన్, కన్నా, సిరాజ్ లు కలిసి ఛాయ్ తాగడం అలవాటు. ఎప్పటి లాగే ఈ నెల 2వ తేదిన రాత్రి గం 10ల సమయంలో తాజ్ తన పూల దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లే సమయంలో కన్నా, సిరాజ్ లు ఇద్దరూ ధర్మశాల గేటు వద్ద పడుకుని ఉన్నారు. మరుసటి రోజు (శుక్ర వారం) ఉదయం గం 9.40ల ప్రాంతంలో తాజ్ తన దుకాణా నికి వచ్చి సిరాజ్ ను ఛాయ్ తీసుకు రావాలని పురమాయిం చాడు. సిరాజ్ ఛాయ్ తీసుకుని వచ్చిన తర్వాత కన్నాను నిద్ర లేపేందుకు తాజ్ వెళ్లి పిలిచాడు. ఎంతకీ కన్నా నుంచి స్పందన లేకపోవడంతో తాజ్ దగ్గరగా వెళ్లి పరిశీలించాడు. ఈ సమయం లో అతడు కన్నా తలకు బలమైన గాయం అయివుండి రక్తం మడుగులో పడి ఉండటాన్ని గమనించాడు. వెంటనే ఈ సమా చారాన్ని గస్తీ పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే రాంగోపాల్‌పేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహన్ని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరో పాత కక్షలు, లేదా మరేదైనా కారణంతో కన్నా తలపై పదునైన ఆయుధంతో బలంగా కొట్టడం వల్లే తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. పూల వ్యాపా రి మహ్మద్ తాజ్ ఫిర్యాదు మేరకు రాంగోపాల్‌పేట ఇన్స్‌పెక్టర్ బి. సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించారు. హత్య జరిగిన ప్రాంతాన్ని మహంకాళీ ఏసీపీ పరిశీలించారు. హత్య ఎలా జరిగింది అన్న విషయంపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## వార్డుల్లో ఆకస్మిక తనిఖీలు..

**శానిటేషన్‌పై కమిషనర్ ప్రత్యేక దృష్టి**



పలు వారుల్లలో పర్యటిస్తున్న కమిషనర్ సాహితి రెడ్డి

**కొత్తూరు, జులై 3, ప్రభాతవార్త:** కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ సాహితి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో పర్యటించిన ఆమె శానిటేషన్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్బంగా కమిషనర్ సాహితి రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు ఇష్టానుసారంగా రోడ్లపై, ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన చెత్త సేకరణ వ్యవస్థను వినియోగించుకోవాలని, నిబంధనలను ఉల్లంఘించి ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలని. ఆదేశించారు. కాలువలు, రహదారులు, చెత్త సేకరణ కేంద్రాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచి ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ ఇన్‌చార్జ్ మహేష్, జవాన్లు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే మెరుగైన పరిపాలన



నూతన భవనానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

**జిల్లెడు చౌదరిగూడ, జులై 3, (ప్రభాతవార్త):** గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మురుగైన పరిపాలన అందించడంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం జిల్లేడు చౌదరిగూడ మండలంలోని పిర్జాపూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ (ఉపాధి హామీ) నిధులతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ నూతన భవనానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యాన్ని బలోపేతం చేయాలనే లక్ష ్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గ్రామాభివృద్ధికి అవసరమైన మోలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామపంచాయతీ భవనం నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నర్సింలు, బంధయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి, నాయకులు బాలరాజు, నర్సింలు, పాపయ్య, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ రెడ్డి, ఆంజనేయులు, నవీన్‌తో పాటు గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శాశ్వత నివాస సౌకర్యం కల్పించడమే మాధ్యేయం

**జిల్లెడు చౌదరిగూడ, జులై 3, (ప్రభాతవార్త):** గ్రామాల్లోని పేద ప్రజలకు శాశ్వత నివాస సౌకర్యం కల్పించడమె కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ మండల అధ్య క్షుడు చంద్రశేఖర్ అన్నారు. జిల్లేడు చౌదరిగూడ మండలంలోని పీర్జాపూర్ గ్రామంలో నూతన ఇందిరమ్మ గృహా న్ని శుక్రవారం ఆయన ప్రారంభిం చారు. ఈ సందర్బంగా ఆయన మాటాడుతూ, పేదకుటుంబాలకు సొంత ఇంటి కలను నెరవేర్చాలనే లక్ష ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ గృహాల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా వేలాది పేద కుటుంబాలు సొంతింటి యజ మానులుగా మారుతున్నాయని, ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింలు, బంధయ్య, బాలరాజ్, నర్సింలు, పాపయ్య, సత్యనారాయణ రెడ్డి, వెంకట నర్సింహారెడ్డి, ఆంజనేయులు, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం చేస్తున్న నాయకులు

## సిఎం సహాయనిధి పేదలకు వరం

**మర్పల్లి, జులై3, ప్రభాతవార్త :** సిఎం సహాయనిధి పేదలకు వరం వంటిదని మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు సురేష్‌యాదవ్ అన్నారు. మర్పల్లి మండల కేంద్రంలో శుక్రవారం నాడు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 65 మందికి సిఎం సహాయనిధి కింద మంజూరు జరిగిన చెక్కులను వారు లబ్ధిదారులకు అందజేశారు. 65 మందికిగాను 43 లక్షలు మంజూరి జరిగినట్లు వారు తెలిపారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు శుభాష్‌యాదవ్, గ్రామ సర్పంచ్ మదుగు రామేశ్వర్. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు రఫి, నర్సింలయాదవ్, శేఖర్‌యాదవ్, పలు గ్రామాల సర్పంచ్‌లు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విప్లవ సాంస్కృతికోద్యమానికి నాగన్న మృతి తీరనిలోటు

**షేక్ షావలి, ఇనుప సురేష్**

**జవహార్ నగర్, జులై3, ప్రభాతవార్త :** సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు, అరుణోదయ సాంస్కృతిక ఉద్యమ సీనియర్ కార్యకర్త నాగన్నమృతి విప్లవసాంస్కృతికోద్యమానికి తీరనిలోటని ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షావలి, రెండు తెలుగు రాష్ట్రాల అరుణోదయ కన్వీనర్ ఇనుప సురేష్ పేర్కొన్నారు. ఈ మేరకు వారు శుక్రవారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఖమ్మంలో నాగన్న కన్నుమూసిన వార్త తెలిసి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన వారు, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన జీవితం నాగన్న సొంతమని కొనియాడారు. చివరి శ్వాస వరకు నిజమైన కార్మికవర్గ నాయకుడిగా, విప్లవ భావజాలానికి అంకితభావంతో పనిచేస్తూ ఎందరో సాంస్కృతిక కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. తీవ్ర అనారోగ్యంతో పోరాడి కోలుకుని అందరి ప్రశంసలు పొందిన నాగన్న, కొద్ది రోజులకే తుదిశ్వాస విడవడం బాధాకరమని తెలిపారు. ఆయన సేవలు, పోరాట స్ఫూర్తి విప్లవ సాంస్కృతికోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. నాగన్నకు విప్లవ జోహార్లు అర్పిస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అలాగే ఆయన ఆశయాలను కొనసాగించడం ద్వారానే నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని షేక్ షావలి, ఇనుప సురేష్ పేర్కొన్నారు.

## రాష్ట్ర మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి ఘన స్వాగతం



**కడ్తాల్, జులై 3, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి కడ్తాల్ మండల కేంద్రంలో ఘనంగా స్వాగతం పలికారు. మండలంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఓ వివాహ వేడుకకు మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన మంత్రికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, టిపిసిసి సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, లు పూల బొకే అందజేసి ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పేదవాడికి ఆర్థిక చేయూత సిఎంఆర్ఎఫ్

**సర్పంచ్ కొండల్ రెడ్డి**



**కందుకూరు, జులై 3, (ప్రభాతవార్త):** ఆపదలో ఉన్న కుటుంబాలకు సిఎంఆర్ ఎఫ్ నిధులు ఆర్థిక చేయూత అందిస్తుందని జైత్వారం గ్రామ సర్పంచ్ బైరు కొండల్ రెడ్డి పేర్కొన్నారు. జై త్వరం గ్రామానికి చెందిన చల్లా శ్రీధర్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరడం వలన పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు అయినట్లు తెలిపారు ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సహకారంతో శ్రీధర్ రెడ్డి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం సిఎంఆర్ఎఫ్ నిధుల నుండి 60 వేల రూపాయలు. అదేవిధంగా చాకలి యాదమ్మ ఆరోగ్య సమస్యలపై అయినా ఖర్చులో భాగంగా 35 వేల రూపాయలు సిఎంఆర్ఎఫ్ నిధులు మంజూరైనాయని తెలిపారు. ప్రభుత్వం నుండి మంజూరైన ఈ చెక్కులను శుక్రవారం బాధిత కుటుంబాలకు అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబాలను సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వాలకు అండగా నిలవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ వెంకటయ్య, వార్డు సభ్యులు వరుస సత్యనారాయణ, లక్ష్మణ్, నవీన్, సంఘం మమత, మహేందర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్, నాయకులు దర్శన్, ప్రకాశ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించాలి

**పెద్దేముల్, జులై 3, ప్రభాతవార్త:** చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేసేలా ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకోవాలని మండల విద్యాదికారి నర్సింగ్‌రావు అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని యంఆర్‌సి భవనంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో వివిధ అకాడమిక్ విషయాలను అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా యంఈఓ నర్సింగ్‌రావు మాట్లాడుతూ పాఠశాలలలో విద్యార్థులందరికి నోటు పుస్తకాలు, వర్క్ బుక్స్ ,పాఠ్యపుస్తకాలను అందించాలని అన్నారు. ప్రతి విద్యార్థిలో సామర్థ్యం పెంచేవిధంగా ఉపాధ్యాయులు కృషిచేయాలని అన్నారు. డిఎస్‌సి ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్‌ను, ఎఫ్ఎల్ఎన్ సామర్థ్య పరీక్షను ఈ నెల 14 పాఠశాలలో నిర్వహించాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని మెను ప్రకారం విద్యార్థులకు అందించాలని అన్నారు. పాఠ శాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు . పచ్చదనంతో పాటు పాఠశాలలో ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ


**PUBLIC NOTICE**

Notice is hereby given to the general public that **Mr. Kanakamamidi Prashanth Reddy, S/o Late Kanakamamidi Manik Reddy** (hereinafter referred to as the **"Mortgagor"**), is proposing to create a mortgage by deposit of title deeds/ equitable mortgage in favour of **RBL Bank Limited**, having one of its offices at Ameerpet, Hyderabad, for securing financial assistance proposed to be availed from the said Bank.The Mortgagor has represented that originally Late Sri Kanakamamidi Lachi Reddy was the absolute owner of the schedule property. The said Sri Kanakamamidi Lachi Reddy died intestate on 30.01.2014 leaving behind his only son, Sri Kanakamamidi Manik Reddy, who had predeceased him and died on 03.05.2006, leaving behind the legal heirs i.e., 1) Kanakamamidi Sangeetha 2) Kanakamamidi Vishnu Vardhan Reddy 3) Kanakamamidi Prashanth Reddy. Subsequently, Kanakamamidi Sangeetha and Kanakamamidi Vishnu Vardhan Reddy, being co-heirs have relinquished their share in favour of Sri Kanakamamidi Prashanth Reddy vide Registered Release Deed bearing Document No. 128 of 2026, dated 07.01.2026, duly registered at Sub-Registrar, Vikarabad. By virtue of inheritance and the aforesaid Release Deed, Sri Kanakamamidi Prashanth Reddy claims to be the absolute owner and person entitled to deal with and mortgage the schedule property.

Therefore, any person(s)/ bank(s)/ financial institution(s), who has any claim, right, title, interest or objections whatsoever in respect of the said property is hereby called upon to submit the same along with supporting documents, to the below undersigned within 5 days from the date of this notice. In the event no claim or objection is received within the aforesaid period, my client, RBL Bank Limited shall proceed with creation of mortgage and sanction/disbursement of the proposed loan facility, without any further reference to any person. Any claim or objection received thereafter shall not be entertained.

**Schedule of Property**

All that the House bearing No. 7-1-153, admeasuring an Plinth area of 783 Sq.feets in the Ground Floor and, Plinth area of 783 Sq.feets in the First Floor, constructed on total land admeasuring 116.11 Sq.Yards, Situated at Kothagadi Village, Vikarabad Municipality, Vikarabad District., bounded by: NORTH : Open Place of Prabhakar Reddy; SOUTH : Open Place of Ravinder Reddy; EAST : Road; WEST : House of Janardhan Reddy.

**V. SANTOSH**
Advocate
Office: Flat # 408, 6 th Floor, 'A' block, Shobha Pavani Apartment, H.No. 1-9-1114 to 1117, VidyaNagar, Hyderabad. Ph# 8885600483

# ఈర్లపల్లిలో భూసర్వే ప్రక్రియ ప్రారంభం

-అత్యాధునిక సాంకేతికతతో భూముల సరిహద్దులు గుర్తింపు
-గ్రామంలోని 1 నుండి 6 సర్వే నంబర్ల వరకు సర్వే నిర్వహణ

**దౌల్తాబాద్, జులై 3, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం ఈర్లపల్లి గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి డిజిటల్ సర్వే ప్రక్రియ జోరుగా సాగుతోంది. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా చేపట్టిన ఈ సర్వేలో భాగంగా, అధికారులు శుక్రవారంరోజు గ్రామంలోని 1 నుండి 6 సర్వే నంబర్ల వరకు సర్వే ప్రక్రియ చేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, భూముల సరిహద్దులను ఎంతో ఖచ్చితత్వంతో నిర్ణయిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**రైతులు ఆందోళన చెందవద్దు**

ఈ సర్వే ప్రక్రియపై అధికారులు మాట్లాడుతూ... రైతులు ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ప్రతి ఒక్కరి సర్వే నంబర్లను ఎంతో పక్కాగా, నిబంధనల ప్రకారం కొలవడం జరుగుతుందని వారు స్పష్టం చేశారు. భూ యజమానులకు పూర్తి సంతృప్తి కలిగేలా, పారదర్శకంగా సర్వే చేపడుతున్నామని, భూమి విషయంలో ఎటువంటి అన్యాయం జరగదని వారు ఈ సందర్భంగా తెలిపారు.

**ప్రతి భూమికీ ప్రత్యేక క్యూఆర్ కోడ్**

భూ రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియలో భాగంగా, సర్వే పూర్తయిన ప్రతి సర్వే నంబర్‌కు ఒక ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను కేటాయించనున్నారు. దీనివల్ల భూ యజమానుల వివరాలు, భూమి విస్తీర్ణం, సరిహద్దు మ్యాప్‌లు డిజిటల్ రూపంలో శాశ్వతంగా సురక్షితంగా ఉంటాయన్నారు. భవిష్యత్తులో భూముల క్రయవిక్రయాల్లో చోటుచేసుకునే మోసాలకు ఈ విధానం ద్వారా అడ్డుకట్ట పడనుందని, మండలంలోని ఈర్లపల్లిని వివాదాలు లేని గ్రామంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని అధికారులు వివరించారు.


ఈర్లపల్లి గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న సర్వేయర్

# ప్రజల ఆరోగ్యంతో రాజీ పడొద్దు...

- ఘన వ్యర్థాల కేంద్రం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- ప్రజల అభిప్రాయం లేకుండా నిర్ణయాలు సరికావు
- బిజెపి నాయకుల హెచ్చరిక

**కొత్తూరు, జులై 3, ప్రభాతవార్త:** ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని కొత్తూరు మండల బీజేపీ అధ్యక్షుడు అత్తాపూర్ మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణను విస్మరించి తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో తీవ్ర పరిణామాలకు దారితీస్తాయని ఆయన హెచ్చరించారు. కొత్తూరు మండలంలోని సిద్దాపూర్ గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఒకవైపు "ఎకో టౌన్" పేరుతో అభివృద్ధి హామీలు ఇస్తూ, మరోవైపు అదే ప్రాంతంలో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించడం ప్రభుత్వ విధానాల్లోని వైరుధ్యాన్ని బయటపెడుతోందని విమర్శించారు. ఈ కేంద్రం ఏర్పాటుతో భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, దుర్వాసనలు, వాయు కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా రైతులు, మహిళలు, చిన్నారులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను తెలుసుకోకుండా, గ్రామసభ నిర్వహించకుండా ఇలాంటి కీలక నిర్ణయం తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అన్నారు. ప్రజల ఆమోదంతోనే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సిద్దాపూర్‌లో ప్రతిపాదించిన ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని వెంటనే రద్దు చేయాలని, స్థానిక ప్రజలు, రైతులు, ప్రజాప్రతినిధులతో చర్చించి పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి ఎలాంటిహాని కలగని ప్రత్యామ్నాయ స్థలాన్ని గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే గ్రామస్తులు, రైతులు, ప్రజాసంఘాలతో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని చేపడతామని మహేందర్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ చారి, శివ ముదిరాజ్, శ్రీకాంత్ నాయక్, రమేష్ నాయక్, మోహన్, రమేష్, భాస్కర్, బాబు నాయక్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మండల బీజేపీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా కాసు శ్రీనివాస్ రెడ్డి

**తలకొండపల్లి జులై 3, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నూతనంగా లింగరావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డిని నియమించారు. 4 సంవత్సరాలుగా తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా డోకూరి ప్రభాకర్ రెడ్డి కొనసాగారు. శుక్రవారం నాడు కాంగ్రెస్ పార్టీ మండల నూతన అధ్యక్షులుగా అన్ని మండలాలకు నియామకం చేపట్టారు. తలకొండపల్లి మండలానికి అధ్యక్షునిగా లింగరావుపల్లి గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి రెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కాసు శ్రీనివాస్ రెడ్డి గతఅసెంబ్లీ ఎన్నికల ముందు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకొని పార్టీలో చురుకుగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా కాసు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్టానం తనపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పగించినందుకు తను పూర్తిస్థాయిలో పనిచేసి మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## బిఎస్పి పార్టీ గ్రామ నూతన కమిటీ ఎన్నిక


బిఎస్పిలో చేరిన యువకులు

**కొడంగల్, జులై 3, ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండలంలోని నీటూర్ గ్రామంలో బిఎస్పి పార్టీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ యు. రమేష్‌బాబు, తాలూకా అధ్యక్షులు శ్రీనివాస్ అద్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షులుగా జి. నరేష్, ఉపాధ్యక్షులుగా ఎం. నరేష్, పి. చందు, జనరల్ సెక్రటరీగా ఎం. మహేష్, విలేజ్ సెక్రెటరీగా మంతటి నరేష్, విలేజ్ ట్రెజరర్‌గా ఎన్, ఆనంద్‌లు ఎన్నికైయ్యారు. అనంతరం గ్రామంలో యువకులు భారీగా బహుజన సమాజ్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు, శ్రీనివాస్‌లు పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలతో ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీఎస్పీ పార్టీని బలోపేతం చేయడానికి సమిష్టిగా కృషి చేయాలన్నారు.

## పరిసరాల శుభ్రతపై అవగాహన

**కొడంగల్, జులై 3, ప్రభాతవార్త:** కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో పరిసరాల పరిశుభ్రతపై కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా డిఎంఅండ్‌హెచ్‌ఓ సుధాకర్ లాల్, మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్, మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్‌తో కలిసి పరిసరాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ దోమలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమలు పుట్టకుండా కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు సుష్మదాము తదితరులు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం

**శంషాబాద్, జులై 3, ప్రభాతవార్త :** కుటుంబ సభ్యులు ఆసుపత్రికి వెళ్లి వచ్చేలోగా ఇంట్లో ఒంటరిగా ఉన్న 17 ఏళ్ల యువతి అదృశ్యమైన ఘటన శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సిఐ నరేందర్ రెడ్డి వివరాల ప్రకారం...శంషాబాద్ పరిధిలోని మదనపల్లి పాత తాండకు చెందిన తల్లి రుక్క జూన్ 28న పాలమాకులలోని ఆసుపత్రికి మామను తీసుకెళ్లింది. సాయంత్రం తిరిగి ఇంటికి రాగా కుమార్తె నీరజ కనిపించ లేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. అనంతరం తల్లి రుక్క శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పేదల ఆశాజ్యోతి శంకర్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**జవహర్ నగర్, జులై 3, ప్రభాత వార్త:** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల పెన్నిధి, ఆపదలో ఉన్న వారికి ఎల్లప్పుడూ అండగా నిలిచే నాయకుడు కారింగుల శంకర్ గౌడ్ అని సామాజిక సేవకుడు బూడిద వెంకటేష్ పేర్కొన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు శంకర్ గౌడ్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన సామాజిక సేవకుడు బూడిద వెంకటేష్ శంకర్ గౌడ్‌కు శాలువా కప్పి సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బూడిద వెంకటేష్ మాట్లాడుతూ జవహర్ నగర్ అభివృద్ధిలో కారింగుల శంకర్ గౌడ్ పాత్ర ఎంతో కీలకమైందని అన్నారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం, పేదల సమస్యల పరిష్కారంలో ఆయన చేసిన సేవలుచిరస్మరణీయమని కొనియాడారు. ప్రజల మధ్య ఉండి వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలవడం శంకర్ గౌడ్ ప్రత్యేకత అని పేర్కొన్నారు. పేద ప్రజలకు ఎల్లవేళలా ఆపన్నహస్తంలా నిలుస్తూ, అవసరమైన వారికి సహాయం అందించడంలో ఎప్పుడూ ముందుంటారని అన్నారు. సమాజంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజా సేవ పట్ల ఆయనకున్న అంకితభావం యువతకు ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. జవహర్ నగర్ రూపశిల్పిగా పేరుగాంచిన శంకర్ గౌడ్ మరెన్నో జన్మదినాలు ఆరోగ్యంగా, ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. దేవుని ఆశీస్సులతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు.



## నాగారం గ్రామంలో నీటి కష్టాలకు చెక్

సర్పంచ్ చొరవతో అందుబాటులోకి కొత్త బోరు

**ధారూర్, జులై 3, ప్రభాతవార్త:** ధారూర్ మండల పరిధిలోని నాగారం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. స్పీకర్, పంచాయతీ నిధులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, గ్రామ సర్పంచ్ నిరటి లక్షీ ్మ తీసుకున్న ప్రత్యేక చొరవతో గ్రామస్తులకు నీటి కష్టాలు తీరాయి. గ్రామంలో చాలా కాలంగా నీటి ఎద్దడి ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గుర్తించిన సర్పంచ్, వెంటనే స్పందించి స్పీకర్ దృష్టికి తీసుకెళ్లగా, స్పీకర్ ప్రత్యేక నిధులను మంజూరు చేయించారు. దీనిలో భాగంగా గ్రామంలో నూతనంగా బోరు వేయించి, మోటారును కూడా బిగించారు. దీంతో నీటి సరఫరా మెరుగుపడి, ప్రజల దాహార్తి తీరనుంది. తమ గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన సర్పంచ్ నిరటి లక్ష్మికి, సహకరించిన ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏనుగుల శ్రీనివాస్, బాబన్ ,కరీం, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బూత్ ఇన్‌చార్జ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు నమోదు

**జవహర్ నగర్, జులై 3, ప్రభాతవార్త:** ఓటరు నమోదు ప్రక్రియలో ప్రజలంతా భాగస్వాములు కావాలని, పారదర్శకతతో కూడిన ఓటరు జాబితా రూపకల్పనే లక్ష ్యంగా బీఆర్ఎస్ నాయకులు పనిచేస్తున్నారని జవహర్ నగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండలు ముదిరాజ్ అన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పురస్కరించుకుని శుక్రవారం జవహర్ నగర్‌లోని పలు పోలింగ్ బూత్‌లను కొండలు ముదిరాజ్ పార్టీ కార్యకర్తలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా బూత్ ఇన్‌చార్జ్ యమగాని జనలక్ష్మి, బీఎల్‌ఓ స్వాతి నిర్వహిస్తున్న ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొండలు ముదిరాజ్ మాట్లాడుతూ, ఓటరు నమోదు ప్రక్రియ ప్రభుత్వ అధికారుల ఆధ్వర్యంలో సజావుగా జరుగుతోందని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు, యువతి తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే పేరు మార్పులు, చిరునామా మార్పులు, ఓటరు జాబితాలో తప్పులు ఉన్నవారు వాటిని సరిదిద్దు కునేందుకు ఈఅవకాశాన్ని వినియోగిం చుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఓటే ప్రజల వజ్రాయుధమని అన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును నమోదు చేసుకుని బాధ్యతాయుతంగా వినియోగించినప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటరు పాత్ర కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జ్ యమగాని జనలక్ష్మి, బీఎల్‌ఓ స్వాతి, మహిళా కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు. జనలక్ష్మి మాట్లాడుతూ ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరుగా నమోదు అయ్యేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.



# శ్రీవారి ఆలయ భూ నిర్వాసితులకు చెక్కులు అందజేత

**కొడంగల్, జులై 3, ప్రభాతవార్త:** కొడంగల్ పట్టణంలోని శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా ఇళ్ళు కోల్పోయిన నిర్వాసితులకు ఇళ్ల పట్టాలను అందించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి, మున్సిపల్ చైర్మెన్ నందారం ప్రశాంత్, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి కలిసి పట్టాలతో పాటు ఒక్కో కుటుంబానికి రూ.7.85లక్షల ప్యాకేజీ చెక్కులను అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆలయ పునఃనిర్మాణం కోసం మొత్తం 86 మంది నివాసాలను సేకరించడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం 76 మందికి పట్టాలు, ప్యాకేజీలు సిద్దంగా ఉన్నాయని, వారిలో శుక్రవారం 35 మంది నిర్వాసితులకు పట్టాలతో పాటు రూ.7.85లక్షలకు సంభందించిన చెక్కును ప్రతి ఒక్కరికి అందించారు. కాగా ఇళ్ళు కోల్పోయిన వారిలో ఆలయ ధర్మ కర్తలు ఉన్నారని వారు ఇళ్ళ స్థలాలు తీసుకోకుండా స్వచ్ఛంధంగా వదులు కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మేన్ శంకర్‌నాయక్, మార్కెట్ కమిటీ చైర్మేన్ అంబయ్యగౌడ్, మున్సిపల్ కమీషనర్ బలరాంనాయక్‌లతో పాటు మున్సిపల్ కౌన్సిలర్‌లు, భూ నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.


భూ నిర్వాసితులకు ఇంటిపట్టా, ప్యాకేజీ చెక్కును అందిస్తున్న తిరుపతిరెడ్డి

# మోత్కుపల్లి ప్రాథమిక పాఠశాల ఆకస్మిక తనిఖీ

**కోట్‌పల్లి, జులై 3:** వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామంలో శుక్రవారం నాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తహసీల్దార్ ఆనంద్ రావు, మండల విద్యాధికారి చంద్రప్ప తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, తరగతి గదుల నిర్వహణ, పారిశుద్ధం తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన వాతావరణంలో బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షి ంచాలని, విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


ఈ తనిఖీలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# దళితుల సమస్యల పరిష్కారానికే పెద్ద పీట


నూతనంగా ఎంపికైన జిల్లా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు బేగరి రాజును సన్మానించిన చేవెళ్ల ఆర్డిఓ పార్థసింహారెడ్డి

**చేవెళ్ల, జులై 3, ప్రభాతవార్త:** దళితుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని, దళితుల భూ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని చేవెళ్ల ఆర్డిఓ పార్థసింహారెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్ల ఆర్డిఓ కార్యాయలంలో చేవెళ్ల ఆర్డిఓ పార్థసింహారెడ్డిని జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు బేగరి రాజు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యంగా పీఠికను చేవెళ్ల ఆర్డిఓ పార్థసింహారెడ్డికి జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు బేగరి రాజు అందజేశారు.

నూతనంగా ఎంపికైన జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు బేగరి రాజు ను చేవెళ్ల ఆర్డిఓ పార్థసింహారెడ్డి ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా చేవెళ్ల ఆర్డిఓ పార్థసింహారెడ్డి మాట్లాడుతూ దళితుల పట్ల ఎవరైన చిన్నచూపు చూసిన కించ పరిచిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబందించిన ఏ సమస్యనైన తమకు పిర్యాదు చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటా మన్నారు. నిక్కచ్చిగా అంకిత భావంతో అధికారులు పని చేస్తే సత్ఫలితాలు వస్తామయని జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు బేగరి రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో అసైన్డ్ భూముల సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పర శ్రీనివాస్, అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం చేవెళ్ల మండల అధ్యక్షుడు మల్లేపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అధ్యక్షులు అమరేందర్‌కు సన్మానం

**ఘట్‌కేసర్, జులై 3, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులుగా నియమితులైన సామల అమరేందర్‌ను అవుషాపూర్ నాయకులు సన్మానించారు. అవుషాపూర్‌లోని హజ్రత్ షానూర్‌బాబా దర్గాను శుక్రవారం అమరేందర్ సందర్శించి ప్రత్యేక ప్రార్ధణలు చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు-మాజీ వార్డుసభ్యులు కంచర్ల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ అధ్యక్షులు అమరేందర్‌ను శాలువా కప్పి సన్మానించారు. ఎదులాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరి సహకారంతో కృషి చేయాలని వారు కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన పేదలకు చేరేలా చొరవ చూపాలని కోరారు. ఈకార్యక్రమంలో వెంకట్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు భాస్కర్, మధార్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.


అవుషాపూర్‌లో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు అమరేందర్‌ను సన్మానిస్తున్న వెంకట్‌రెడ్డి తదితరులు

# ఘనంగా అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్టాపన

**ఘట్‌కేసర్, జులై 3, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ ఎదులాబాద్‌లో శుక్రవారం శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి విగ్రహప్రతిష్టా, కుంబాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. నూతన నిర్మించిన ఆలయంలో వేదపండితుల మంత్రోచ్చారణాల మధ్య శాస్త్రోక్తంగా ప్రతిష్ట జరిపారు. వేదపారాయణం, ఆలయ ప్రదర్శన, యంత్ర, విగ్రహ, శిఖర, ద్వారకాతదంభ ప్రతిష్ట, పూర్ణాహుతి, అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం శ్రీఅయ్యప్పస్వామి పుష్పాభిషేకం, పదునెట్టాంబడి మహాపడి పూజ, హరిహరాసనం తదితర పూజలు వైభవంగా నిర్వహించారు. స్వర్గీయ నర్విన్ లింగయ్యగుప్తా-పెంటమ్మ దంపతుల కుమారులు నర్విన్ అశోక్‌గుప్తా, నర్విన్ సురేందర్‌గుప్తా, నర్విన్ భవాని చిట్టిమల్ల శ్రావణ్, చిట్టిమల్ల జ్యోతి, రాచమల్ల స్వరూపరాణి, శంకర్ కుటుంబసభ్యుల సహకారంతో మహోత్సవం నిర్వహించారు. గురుస్వామి బ్రహ్మశ్రీ కరంచేటి శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో అర్చకులు కరంచేటి గణేశ్‌శర్మ వైదిక బృందం విగ్రహ ప్రతిష్టాపన పూజలు చేశారు. ఎదులాబాద్‌లోని శ్రీరామచంద్రస్వామి ఆలయం నుంచి మంగళవాయిద్యాలు, అయ్యప్పశరణుఘోష మధ్య పెద్దసంఖ్యలో భక్తులు అయ్యప్పస్వామి ఆలయం వరకు ఊరేగింపుగా వచ్చి స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈకార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు-ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, ఎదులాబాద్ మాజీ సర్పంచ్ బట్టె శంకర్, బిజెపి బూత్ అధ్యక్షులు ఎర్రోళ్ల మురళీకృష్ణ, కె. సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


అయ్యప్పస్వామి దేవాలయ ప్రతిష్టలో పాల్గొన్న మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

## కార్యాలయాలను సందర్శించిన డిపిఓ జయసుధ

**పూడూరు, జులై 3, ప్రభాతవార్త :** రైతులకు యాప్‌ద్వారా యూరియాను సకాలంలో అందించే విధంగా చొరవచూపాలని జిల్లా పంచాయతీ అధికారి జయసుధ పేర్కొన్నారు. శుక్ర వారం పూడూరు మండలం పరిధిలోని పిఎసిఎస్ ,ఎంపిడిఓ, ఎస్‌సి హాస్టల్‌ను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఎరువులను అందించే విధానాన్ని సిబ్బంధిని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం సందర్భంగా గ్రామాల్లో పారిశుధ్యం పరిశుభ్రత పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ కార్యాలయ సిబ్బందికి సూచించారు.


పూడూరు పిఎసిఎస్‌లో ఎరువులగురించి సిబ్బంధిని అడిగి తెలుసుకుంటున్న డిపిఓ జయసుధ తదితరులు

ఎస్‌సి హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థుల సంఖ్యను పెంచుకునే విధంగా చర్యలు తీసుకోవాలని వార్డెన్‌కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ సుందర్, ఎంపిడిఓ శివప్రకాష్, ఎఇఓ సాయిరాం, పిఎసిఎస్ సిబ్బంది మురళీ తదితరులు పాల్గొన్నారు.

## నరేందర్‌నే అధ్యక్షుడిగా నియమించాలి

కండ్లకోయ గ్రామ కాంగ్రెస్ కమిటీ తీర్మానం

**మేడ్చల్, జులై 3, ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని కండ్లకోయ గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బండారి నరేందర్ ముదిరాజ్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించారు. గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి నరేందర్ ముదిరాజ్‌నే నియమించాలని డిమాండ్ చేస్తూ ఏకగ్రీవంగా ఆయనకు అండగా నిలిచారు.


గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ నరేందర్ ముదిరాజ్‌కు మద్దతు ప్రకటించిన కండ్లకోయ కాంగ్రెస్ నేతలు

ఈ సందర్భంగా తాజా మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్, కండ్లకోయ మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డితో పాటు పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడుతున్న బండారి నరేందర్ ముదిరాజ్‌కు న్యాయం జరగాలని, ఆయన్నే డివిజన్ అధ్యక్షుడిగా నియమించాలని కోరారు. అంతేకాకుండా, గుండ్లపోచంపల్లి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలంటే క్షేత్రస్థాయిలో పనిచేసిన నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని, నరేందర్ ముదిరాజ్‌కు అన్యాయం జరిగిందనే భావన కార్యకర్తల్లో ఉందని వారు పేర్కొన్నారు. ఈ మేరకు కండ్లకోయ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మూకుమ్మడిగా బండారి నరేందర్ ముదిరాజ్‌కు తమ పూర్తి మద్దతు ప్రకటిస్తూ, పార్టీ అధిష్ఠానం వెంటనే ఈ అంశంపై పునఃపరిశీలన చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కండ్లకోయ మాజీ సర్పంచ్ కందాడి నరేందర్ రెడ్డి, మాజీ కోప్షన్ సభ్యులు గౌస్ పాషా, నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, శ్రీకాంత్, శివ, అరవింద్, రవీందర్ రెడ్డి, దీపక్, శ్రీనివాస్ గౌడ్, హరిబాబు, ఎర్రోళ యాదయ్య, బిక్షపతి, తల్లారి పెంటయ్య, వై సిధార్థ, తలారి శ్రీను, వెంకటేష్, ఎర్రోళ్ల విజయ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.